AKHANDAA SURYAA

అఖండ సూర్య

PRGI NO : TGTEL/25/A1809

అజేయ ప్రజా స్వరం

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Hyderabad and Vijayawada, Vishakapatnam

E-Paper:https://epaper.akhandasurya.com

సంపుటి : 02 సంచిక : 82 హైదరాబాద్, అక్టోబర్ 20, మంగళవారం, 2026 పేజీలు : 12 వెల : 6.00





నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించాలి

- కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత
- గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన కవిత
- ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్
- నవంబర్ చివరి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సూచన
- గడువులోగా పనులు చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక

07

ఎల్‌నినోపై ప్రత్యేక కమిటీ

భట్టి విక్రమార్కకు బాధ్యతలు

ఎల్‌నినో ప్రభావంపై అధ్యయనానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంత్రులు సీతక్క, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, వాకిటి శ్రీహరి సభ్యులు

కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

నీటి లభ్యత, సరఫరాపై నిరంతర సమీక్షలు

ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు

వేసవికి ముందే నీటి ఎద్దడి ప్రాంతాల గుర్తింపు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చులో జాప్యం వద్దన్న భట్టి



అఖండసూర్య, హైదరాబాద్:

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ఈ పరిస్థితులపై అధ్యయనం చేసి, అవసరమైన కార్యాచరణను రూపొందించేందుకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కరువు నివారణకు ముందస్తు ప్రణాళిక

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే పరిస్థితులను మిగతా 7లో..



34 నెలల్లో 12.40 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు

- భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి పొంగులేటి
- రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం
- భూ భారతి చట్టం అమల్లోకి వచ్చాక 5.68 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు రీ-సర్వేతో పరిష్కారం
- సాగుదారులను గుర్తించి
- చట్టబద్ధంగా భూ హక్కుల కల్పన
- నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా హక్కులు
- సూర్యాపేట జిల్లాలో 15 గ్రామాల్లో 2,400 మందికి పట్టాలు
- మొత్తం 3,450 ఎకరాలకు భూ హక్కుల కల్పన

అఖండసూర్య, హైదరాబాద్ :

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ భారతి చట్టం అమలు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, భూముల రీసర్వే పురోగతిపై సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించడంతోపాటు ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

12.40 లక్షల మంది రైతులకు పాస్‌పుస్తకాలు

గత 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన మిగతా 7లో..

చెరకు రైతుల ఆందోళనలు

- మోదీ జోక్యం కోరిన కర్ణాటక సీఎం
- ఉత్తర కర్ణాటకలో రైతుల నిరసనలతో నిలిచిన చెరకు క్రషింగ్
- పొలాల్లోనే పాడవుతున్న పంట.. రైతులకు పెరుగుతున్న నష్టాలు
- చక్కెర కనీస మద్దతు ధర పెంచాలని డీకే శివకుమార్ విజ్ఞప్తి
- 2019 నుంచి కిలో చక్కెర ధర రూ.31 వద్దే కొనసాగుతోందని వెల్లడి
- చెరకు ఆధారిత ఇథనాల్ ధరలను సవరించాలని కేంద్రానికి సూచన
- ఇథనాల్ కొనుగోలు టెండర్ల విధానాన్ని సమీక్షించాలని కోరిన సీఎం



అఖండసూర్య, బెంగళూరు:

ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం జోక్యాన్ని కోరింది. చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడం, పంట పొలాల్లోనే పాడైపోతుండటంతో రైతులు తీవ్ర మిగతా 7లో..





నాసర్ పుర ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ముగింపు

- ఘనంగా కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పణ

సిద్దిపేట అఖండ సూర్య

నాసర్ పుర ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నాడు అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిశాయి. నవరాత్రుల ముగింపు సందర్భంగా చివరి రోజైన సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన సేవలు నిర్వహించారు. అనంతరం మహిళలందరూ భక్తిభావంతో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే లోకపావని అమ్మవారి కృపాకటాక్షాలు నాసర్ పుర బోనాల గల్లీకి ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాసర్ పుర ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు మహిళలు మరియు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల జయజయధ్వానాలు,తో బ్రహ్మ బట్ల నాగరాజు శర్మ పంతులు తొమ్మిది రోజుల వేదమంత్రోచ్చారణల తో పూజలు సోమవారం రోజున ముగింపు వేడుకలు ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిశాయి అని తెలియజేశారు

పాలపిట్టను కాపాడండి.. జంతు హింస లేని దసరా జరుపుకోండి

- రాష్ట్ర పక్షి సంరక్షణపై ప్రజలకు అటవీ శాఖ విజ్ఞప్తి

సిద్దిపేట, అఖండ సూర్య :



తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్టను సంరక్షించాలని సిద్దిపేట జిల్లా అటవీ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. దసరా పండుగ సందర్భంగా పాలపిట్టలను పట్టుకోవడం, విక్రయించడం, హింసించడం వంటి చర్యలకు పాల్పడవద్దని అధికారులు సూచించారు. ప్రకృతిలో జీవవైవిధ్యాన్ని కాపాడటంలో పక్షుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.
వన్యప్రాణి (సంరక్షణ) చట్టం, 1972 ప్రకారం పాలపిట్టలను పట్టుకోవడం, విక్రయించడం, హింసించడం చట్టరీత్యా నేరమని అటవీ శాఖ స్పష్టం చేసింది. పాలపిట్టకు ఈ చట్టంలోని షెడ్యూల్II కింద రక్షణ కల్పించినట్లు తెలిపింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించింది.
ప్రజలందరూ పాలపిట్టలను సంరక్షిస్తూ, జంతు హింసకు తావులేని విధంగా దసరా పండుగను జరుపుకోవాలని అటవీ శాఖ కోరింది. ఎవరైనా పాలపిట్టలను పట్టుకున్నా, విక్రయించినా లేదా ప్రదర్శించినా వెంటనే అటవీ శాఖ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు 18004255364, 9803338666 కు సమాచారం అందించాలని సూచించింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా అటవీ అధికారి ఎ. పద్మజారాణి, ఐఎఫ్ఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



అంక్సాపూర్ గ్రామంలో శరన్నవరాత్రి వేడుకలు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

నంగునూరు : అఖండ సూర్య

అంక్సాపూర్ గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర నవరాత్రి వేడుకల్లో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మరియు హోమ మహోత్సవంలో పలువురు ప్రముఖులు ఘనంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్ర సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంగునూరు కోల రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వేణు, బెదురు తిరుపతి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల ఆశీస్సులు తీసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరూ సుఖసంతోసాలతో, ఆయురారోగ్యాలతో పర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



వెట్టి చాకిరి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి
- 'స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అఖండ సూర్య

వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలన, కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించే ఈ ప్రచార రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వెట్టి చాకిరికి గురైన వారు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు వెంటనే ఫిర్యాదు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 08069434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.
అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని రాయపట్నం నూతన పంచాయతీ భవనం

అఖండ సూర్య,మధిర:

మధిర మండలం రాయపట్నం గ్రామంలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోకుండా గత ఆరు నెలలుగా మూతపడి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన నిధులతో నిర్మించిన ఈ భవనం నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ ప్రారంభోత్సవం చేయకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి, రంగులు వెలిసిపోయే పరిస్థితి నెలకొంది.
కాగా నూతన భవనం పూర్తయినా ప్రారంభించకపోవడంతో పంచాయతీ సిబ్బంది ఇప్పటికీ అద్దె భవనంలోనే పంచాయతీ విధులు నిర్వహిస్తున్నారు.దీంతో ప్రతి నెలా అద్దె రూపంలో ప్రభుత్వ ధనం వృధా అవుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒకవైపు లక్షలతో కట్టిన భవనం మూతపడి ఉంటే, మరోవైపు అద్దె భవనానికి అద్దె చెల్లించాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. పాత/అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహించడం వల్ల సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తక్షణమే నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శాతవాహన యూనివర్సిటీలో 49 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి

- నిరుద్యోగ యువత నియామక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, అఖండ సూర్య :

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు విశ్వవిద్యాలయాల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 49 పోస్టుల భర్తీకి అనుమతి లభించిందని వెల్లడించారు. ఈ నియామకాలకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో నంబర్లు 141, 142లను విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు. కామన్ గైడ్‌లైన్స్, రోస్టర్ విధానానికి అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి నియామక నోటిఫికేషన్లు వెలువడనున్నాయని తెలిపారు.

వివిధ విభాగాల్లో ఖాళీలు

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, హుస్నాబాద్:

కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) - 7
సీఎస్ఈ - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - 7
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) - 7
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) - 5
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) - 1
మెకానికల్ ఇంజినీరింగ్ - 2
ఇంగ్లీష్ - 1
మ్యాథమెటిక్స్ - 2
ఫిజిక్స్ - 2
కెమిస్ట్రీ - 2
ఫిజికల్ ఎడ్యుకేషన్ - 1
లైబ్రేరియన్ - 1

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా, యూనివర్సిటీ క్యాంపస్:*
న్యాయశాస్త్రం - 8

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఎల్ఎండీ క్యాంపస్:
ఫార్మసీ - 2

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, యూనివర్సిటీ క్యాంపస్:
కామర్స్ - 1

ఉన్నత విద్యారంగానికి మరింత బలం

ఈ నియామకాలతో రాష్ట్రంలోని ఉన్నత విద్యారంగం మరింత బలోపేతం కావడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుబాటులోకి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



భక్తజన సందోహం మధ్య ముగిసిన అడెల్లి పోచమ్మ గంగ నీళ్ల జాతర...అడెల్లి పోచమ్మ సన్నిధిలో

నిర్మల్ అఖండ సూర్య

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ అడెల్లి పోచమ్మ ఆలయంలో గంగ నీళ్ల జాతర భక్తి పారవశ్యం మధ్య ఘనంగా ముగిసింది. గోదావరి జలాల వద్ద అమ్మవారి పవిత్ర ఆభరణాలను శుద్ధి చేసి ఆలయానికి తీసుకువచ్చే వేడుకను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి ఆభరణాలకు ఘన స్వాగతం పలుకుతూ భక్తులు పోచమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, సామాజిక నేత నల్ల వినయ్ రెడ్డి పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ జి. జానకి శర్మ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టడంతో గంగ నీళ్ల జాతర ప్రశాంతంగా ముగిసింది.




నిర్మల్ ఫుట్‌పాత్‌ల పరిశీలనకు కలెక్టర్ హామీ

నిర్మల్ అఖండ సూర్య

పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌ల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ కలెక్టర్‌కు నేరుగా విన్నవించారు. 2024 నుంచి ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలియజేస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడంతోనే పరిస్థితి ఇంత తీవ్రంగా మారిందని ఆయన స్పష్టం చేశారు. షాపింగ్ మాల్స్ కారణంగా ఫుట్‌పాత్‌లపై అడ్డంకులు ఏర్పడి, ప్రజలు వాకింగ్ ట్రాక్‌లపై నడవలేక రోడ్లపైకి రావాల్సి వస్తోందని వివరించారు. ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం కేటాయించిన రూ.6 కోట్ల నిధుల వినియోగంపై కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయికి వచ్చి వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను పరిష్కరించాలని సయ్యద్ హైదర్ కోరారు.
ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, టౌన్ ప్రెసిడెంట్ రవి, స్పోక్స్‌పర్సన్ వసంత్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు రాజన్న, చొక్కాల భూమన్న, లాయర్ అరవింద్, షేక్ ఇమామ్, షైక్ షాదుల్లా తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.







స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం.. ఆపదలో మిత్రుడి కుటుంబానికి అండ

- **మానవత్వంతో స్పందించి రూ.62,600 ఆర్థిక సాయం అందజేత**

చేర్యాల, అఖండ సూర్య :

స్నేహం అంటే కలిసి చదువుకోవడం, కలిసి తిరగడమే కాదు.. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడమని వీరన్నపేట గ్రామానికి చెందిన బాల్యమిత్రులు నిరూపించారు. తమతో కలిసి చదువుకున్న మిత్రుడు కొట్టూరు నవీన్ కుమార్ అకాల మరణంతో విషాదంలో ఉన్న అతని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.


సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట గ్రామానికి చెందిన కొట్టూరు నవీన్ కుమార్ (2011-12 బ్యాచ్) అకాల మరణం బాల్య మిత్రులను తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో బాల్యమిత్రులు ముందుకొచ్చారు. వాట్సాప్ స్టేటస్ ద్వారా చేసిన విజ్ఞప్తికి స్పందించిన దాతలు తమ వంతు ఆర్థిక సహాయం అందించగా, ఇతర బాల్యమిత్రులు కూడా సహకరించారు.

ఈ విధంగా బాల్యమిత్రులందరూ కలిసి రూ.62,600 ఆర్థిక సహాయాన్ని సమకూర్చి నవీన్ కుమార్ కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి దాతకు, సహకరించిన బాల్యమిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్నేహబంధం కేవలం బాల్యానికే పరిమితం కాదని, జీవితాంతం ఆప్యాయతతో ఒకరికొకరు తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని ఈ సహాయం మరోసారి చాటిచెప్పింది.

నిర్మల్ డీఎస్పీ ఆఫీసు తనిఖీ చేసిన ఎస్పీ

నిర్మల్ అఖండ సూర్య

నిర్మల్ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని సోమవారం ఎస్పీ జానకి షర్మిల తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు క్రైమ్ రిజిస్టర్లు కార్యాలయ పరిసరాలను ఆమే పరిశీలించారు. గ్రేవ్, పోక్సో కేసులతో పాటు దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు.



భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

నిర్మల్ అఖండ సూర్య

దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా వినాయక సాగర్ వద్ద దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్

మంచిర్యాల ప్రతినిధి (అఖండ సూర్య)

బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని విజిత్ కుమార్ మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూల పండుగ బతుకమ్మ ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషం నింపాలని, మహిళలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో ఉద్రిక్తత

- **తాళ్ల పేటలో ఎంపీ ఎమ్మెల్యే వర్గీయుల మధ్య ఘర్షణ**
- **ప్రజా ప్రతినిధులపై సీఐ లాఠీచార్జి**
- **అర్ధరాత్రి వరకు కొనసాగిన నిరసన**
- **తాళ్ల పేటలో ఏసీపీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**

మంచిర్యాల ప్రతినిధి (అఖండ సూర్య)





మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట లో మహిళలు బతుకమ్మ ఆడుతున్న సమీపంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గీయులు తపాసులు పేలుస్తూ ఇబ్బందులకు గురి చేయడంతో తాళ్ల పేట సర్పంచ్ కుర్సెంగ కళావతి, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, మరికొందరు వార్డు సభ్యులు కలుగజేసుకొని వారించారు. వెంటనే తాళ్లపేట పోలీసులుఅక్కడికి చేరుకొని ఇరువురిని శాంతింపజేశారు.విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట సిఐ రమణ కుమార్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పోలీసు వాహనంలోనుండి దిగగానే అక్కడఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యుని చూడకుండా ఇష్టరీతిని లాఠీ తో చితక బాదారు. మహిళలను చూడకుండా సిఐ లాఠీ ఛార్జి చేయడం ఎంతవరకు సమాంజాసమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళా సర్పంచ్ అందులో గిరిజన మహిళా కావడం తో గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నారు. బతుకమ్మ పండుగ వేళ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గం, ఎంపీ వంశీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది.

ఆకారణంగా లాఠీ ఛార్జి చేసిన సిఐ ని సస్పెండ్ చేయాలని రాస్తారోకో..

ప్రజాప్రతినిధులు అని చూడకుండా మహిళా సర్పంచ్ కుర్సింగ కళావతి, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులపై ఆకరణంగా లాఠీ ఛార్జి చేసిన సిఐ ని వెంటనే సస్పెండ్ చేయాలని అర్ధరాత్రి వరకు రహదారిపై రాస్తారోకో చేపట్టారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్మోహన్ రావు తాళ్లపేట కు చేరుకొని జరిగిన సంఘటన పై అరా తిశారు. భాదితుల పక్షాన భరోసా కల్పిస్తూ వారికి మద్దతుగా రోడ్డుపై నిరసన తెలిపారు. అనంతరం జగన్మోహన్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గం కావాలనే గొడవలకు దారితిస్తున్నారని,సంతోషంగా బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న వారిపై ఎమ్మెల్యే అనుచర వర్గం దాడులకు ప్రేరేపించేవిధంగా వ్యవహరించడం సరైంది కాదని హితవు పలికారు. సిఐ ఎవరి మెప్పు కోసం అంతగా ఆరాటపడ్డారో తెలుపాలని సూచించారు.దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే వర్గీయులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అదేవిదంగా వెంటనే సిఐ ని సస్పెండ్ చేయాలని అయన డిమాండ్ చేశారు.

ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో బందోబస్తు....

మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ ఆధ్వర్యంలో తాళ్లపేటలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛ నియా సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.భాదితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు..

మరోసారి బట్టబయలు...

గత కొన్నినెలల క్రితం ఎంపీ గడ్డం వంశీ కృష్ణ తన ఎంపీ నిధులతో దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో ఎంపీ వంశీ ని ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకుని ఫ్లెక్సీలు చించివేశారు.ఇప్పుడు బతుకమ్మ వేడుకల్లో మహిళా ప్రజాప్రతినిధితో పాటు కాంగ్రెస్ శ్రేణులపై దాడులకు పాల్పడటం తో ఇద్దరిమధ్య మళ్ళీ వర్గ పోరు బట్టబయలైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

- **కార్మికులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే హరీష్ రావు**

సిద్దిపేట, అఖండ సూర్య :

దసరా పండుగను పురస్కరించుకొని సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

సిద్దిపేట పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికుల కృషి ఎంతో కీలకమని హరీష్ రావు పేర్కొన్నారు. పట్టణంలో బతుకమ్మ వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

కరోనా సమయంలోనూ విశేష సేవలు

కరోనా మహమ్మారి సమయంలోనూ ప్రాణాలకు తెగించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమించారని ఆయన గుర్తుచేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.

జీతాల పెంపు అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తా

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తమ జీతాలను పెంచాలని పారిశుధ్య కార్మికులు హరీష్ రావును కోరారు. దీనిపై స్పందించిన ఆయన, కార్మికుల జీతాల పెంపు అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం కార్మికులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారితో కలిసి అల్పాహారం చేశారు. పండుగ వేళ కార్మికులతో సమయం గడిపి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ (ఆర్వో) బాలకృష్ణ, డీఈ ప్రేరణ, ఏఈలు పృథ్వీ, జమీల్, ఆర్వో శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అన్వేష్, ప్రజాప్రతినిధులు కడవేరుగు రాజనర్సు, జంగిటి కనకరాజు, కొండం సంపత్ రెడ్డి, బందారం రాజు, మొయిజ్, ఎడ్ల అరవింద్ రెడ్డి, కలకుంట మల్లికార్జున్, చిప్ప ప్రభాకర్, పట్టణ జవాన్లు, పారిశుధ్య కార్మికులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





జర్నలిస్టుల సంక్షేమం కోసం ఐజేయు కృషి

- **ఐజేయు ప్రధాన కార్యదర్శి సోమ సుందర్...**

మంచిర్యాల ప్రతినిధి (అఖండ సూర్య)

జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం జాతీయ స్థాయిలో పార్లమెంట్ లో చట్టం తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) సెక్రెటరీ జనరల్ సోమ సుందర్ అన్నారు..మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్ లో టీయూడబ్ల్యూజే (ఐజేయు) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమ సుందర్ కు శాలువా కప్పి సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ...ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టిందని పేర్కొన్నారు . జంతర్ మంతర్ వద్ద జరిగిన ప్రొటెస్టుకు సంబంధించిన వార్త కవరేజీ కి వెళ్తే పోలీసులు జర్నలిస్టుల పై అమానుషంగా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. నిరసనకారులను ఏ విధంగా పోలీసులు ట్రీట్ చేస్తారో జర్నలిస్టులను అదే విధంగా చూడడం సరైన పద్ధతి కాదు అని పేర్కొన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులను నమోదు చేయడాన్ని ఆయన ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 4 లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని వాటి వలన జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులు అందరికీ ఉచితంగా వైద్యం అందించడానికి హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు కేశెట్టి వంశీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి పింగిళి ,సాక్షి స్టాఫ్ రిపోర్టర్ రాజు , ఎర్రం ప్రభాకర్, కాచం సతీష్, బిరుదుల దేవరాజ్, చొక్కారపు శ్రీనివాస్, శ్రీధర్, తిరుపతి, రాజేష్, లక్ష్మణ్ లు పాల్గొన్నారు



నిర్మల్ జిల్లా మస్కాపూర్లో ఘనంగా దుర్గామాత బోనాల ఊరేగింపు

నిర్మల్ అఖండ సూర్య

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో సోమవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలను తలపైకెత్తుకొని డీజే పాటలు, దప్పుల చప్పుళ్లతో సందడిగా దుర్గా మాత మండపానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ వేడుకలో గ్రామ సర్పంచ్, భక్తులు, దుర్గా మాత కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. పండుగ వాతావరణంతో గ్రామం అంతా భక్తి భావంతో పులకించిపోయింది.



ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి కాంగ్రెస్ పార్టీ

సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ

సిద్దిపేట, అఖండ సూర్య :

విజయదశమి, దసరా పండుగ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు చేరి, రైతులు, మహిళలు, యువత జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సిద్దిపేట అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐక్యతతో పండుగ జరుపుకోవాలని కోరారు.

సంపాదకీయం



బ్రెయిన్ డ్రెయిన్ రివర్స్

డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు భారత్ టెక్నాలజీ నిపుణులను మళ్లీ స్వదేశం వైపు అడుగులు వేస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. 2026 మొదటి తొమ్మిది నెలల్లోనే సుమారు 12,700 మంది వైట్`కాలర్ టెక్ నిపుణులు అమెరికా నుంచి భారతదేశానికి తిరిగొచ్చారు. గత కొన్ని ఏళ్లుగా పెరుగుతున్న ఈ ధోరణి పెరుగుతోంది. 2023లో 7,200, 2024లో 9,800, 2025లో 15,100 తిరిగి రాగా ఈ ఏడాది ఆల్`టైమ్ రికార్డు నమోదు చేసే దిశగా పయనిస్తోంది. స్వదేశానికి తిరిగొస్తున్న వారిలో అధికులు హైదరాబాద్, బెంగళూరు, పూణే, గుర్గావ్ వంటి ప్రధాన టెక్ నగరాల్లో ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు.ఈ భారీ రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్‌కు కారణం హెచ్`1బి వీసా నిబంధనల్లో పెరిగిన అనిశ్చితి, గ్రీన్ కార్డ్ కోసం దశాబ్దాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు , అమెరికా ప్రధాన కంపెనీల్లో సాగుతున్న నిరంతర లేఆఫ్‌లు కారణమని చెబుతున్నారు. వర్క్ వీసాలు పునరుద్ధరణ కాకపోవడం , ఉద్యోగం పోయిన 60 రోజుల్లోగా కొత్త ఉద్యోగం లభించకపోవడంతో ఎంతోమంది అనివార్యంగా స్వదేశానికి తిరిగొస్తున్నారు. దీనికి తోడు, అమెరికాలో పెరిగిన జీవన వ్యయం, పిల్లల భవిష్యత్తు, కుటుంబ అవసరాలు కూడా ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.భారత్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , బహుళజాతి ఐటీ కంపెనీలు అమెరికా అనుభవం ఉన్న నిపుణులను ఆహ్వానిస్తున్నప్పటికీ, ఇక్కడి మార్కెట్ వారికి కొత్త సవాళ్లను విసురుతోంది. స్వదేశానికి వచ్చిన టెక్నీషియన్లు అమెరికాలో పొందిన జీతాలతో పోలిస్తే దాదాపు 65% నుంచి 75% వరకు తక్కువ వేతనాన్ని అంగీకరించాల్సి వస్తోంది. అంతేకాకుండా, ఇప్పటికే దేశీయంగా అందుబాటులో ఉన్న అనుభవజ్ఞులైన స్థానిక టెక్ నిపుణులతో వీరు తీవ్ర పోటీని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఏది ఏమైనప్పటికీ, ఈ రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ భారత ఐటీ , స్టార్టప్ రంగానికి సరికొత్త శక్తినందిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. గ్లోబల్ ప్రాజెక్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ టెక్నాలజీల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నిపుణులు స్వదేశానికి రావడం వల్ల భారతీయ కంపెనీలకు మేధో సంపత్తి, అంతర్జాతీయ అనుభవం లభిస్తాయి. భారత్‌ను గ్లోబల్ టెక్ హబ్‌గా మార్చే దిశగా ఈ పరిణామం కీలకమైన మలుపుగా మారనుంప్రపంచ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగంలో ఆందోళన కలిగిస్తున్నాయి. కంపెనీ ఏఐ విభాగం చీఫ్ ముస్తఫా సులేమాన్ ప్రకారం రాబోయే 12 నుంచి 18 నెలల్లో అనేక వైట్ కాలర్ ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తిగా ఆటోమేట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటివరకు అధిక నైపుణ్యం అవసరమయ్యే కార్యాలయ పనులు, భవిష్యత్తులో నేరుగా ఏఐ వ్యవస్థల ద్వారా నిర్వహించబడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా న్యాయపరమైన సేవలు, అకౌంటింగ్, మార్కెటింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వంటి రంగాలు భారీ మార్పులను ఎదుర్కొనే అవకాశ ముందని టెక్ నిపుణులు చెబుతున్నారు.సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నేపథ్యంలో యంత్రాల సమస్య పరిష్కార సామర్థ్యం, కోడింగ్ వేగం, డేటా విశ్లేషణ కచ్చితత్వం మానవుల స్థాయిని దాటుతున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం అనేక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ కోడ్‌లో గణనీయమైన భాగాన్ని ఏఐ సహాయంతోనే రూపొందిస్తున్నారని నివేదికలు సూచిస్తున్నాయి. బిజినెస్ ఇన్‌సైడర్ కథనం ప్రకారం ఏఐ వినియోగం చిన్న పనులకే పరిమితం కాకుండా, సంక్లిష్టమైన కార్పొరేట్ ప్రక్రియలను కూడా నిర్వహించే దిశగా వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్తులో కంపెనీల్లో ఏఐ ఏజెంట్లు అనే స్వతంత్ర వ్యవస్థలు ప్రవేశించి, మానవ జోక్యం లేకుండానే పనులను పర్యవేక్షించడం, విశ్లేషించడం, వ్యాపార నిర్ణయాలు తీసుకోవడం వంటి బాధ్యతలను నిర్వహించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ఏఐ అనేది ఉద్యోగులను సాయపడే ఒక సాధనంగా మాత్రమే భావించబడింది. అయితే ఇప్పుడు అది నేరుగా మానవ ఉద్యోగాల స్థానాన్ని భర్తీ చేసే దిశగా అడుగులు వేస్తోందనే అభిప్రాయం బలపడుతోంది. ముఖ్యంగా కంప్యూటర్ ఆధారిత పనులు చేసే ఉద్యోగులపై దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం మైక్రోసాఫ్ట్ భారీ వ్యూహాలతో ముందుకు సాగుతోంది. సంస్థ తన సొంత ఫౌండేషన్ ఏఐ మోడళ్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. భవిష్యత్తులో ఒక ఏఐ వ్యవస్థను రూపొందించడం, ప్రస్తుతం బ్లాగ్ రాయడం లేదా పాడ్‌కాస్ట్ రూపొందించడం ఎంత సులభమో అంత సులభంగా మారవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. టెక్నాలజీ విప్లవం వేగంగా జరుగుతున్న ఈ సమయంలో, ఉద్యోగ రంగం కూడా పెద్ద మార్పులకు సిద్ధమవుతోంది. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, ఏఐతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం భవిష్యత్తులో ఉద్యోగ భద్రతకు కీలకమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.దేశంలో వైట్ కాలర్ ఉద్యోగుల నియామకాలు పెరిగాయి. గత ఆగస్టు నెలలో బలమైన వృద్ధిని నమోదు చేసినట్లు ప్రముఖ జాబ్స్ పోర్టల్ నౌకరీ.కామ్ నివేదిక వెల్లడించింది. వార్షిక ప్రాతిపదికన అంటే గతేడాది ఆగస్టు నెలతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో 14 శాతం నియామకాలు పెరిగినట్లు రిపోర్ట్ తెలిపింది. గతేడాది ఆగస్టులో జాబ్ స్పీక్ సూచీ 2664గా ఉండగా అది ఈ ఆగస్టు నాటికి 3028కి పెరిగినట్లు వెల్లడించింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నియామకాలు జోరు అందుకున్నాయని తెలిపింది.తమ ప్లాట్ ఫామ్‌లో ఉద్యోగ సెర్చ్ ఆధారంగా నెలవారీ రిపోర్టును నౌకరీ డాట్ కామ్ రూపొందించింది. ఆటో రంగంలో రికార్డ్ స్థాయిలో 19 శాతం వరకు వైట్ కాలర్ ఉద్యోగ నియామకాలు జరిగినట్లు తెలిపింది. ఆ తర్వాత హెల్త్ కేర్ రంగంలో 16 శాతం, రిటైల్ రంగంలో 15 శాతం, ఇన్సూరెన్స్ రంగంలో 12 శాతం, ఐటీ రంగాల్లో 11 శాతం మేర నియామకాలు జరిగాయని తెలిపింది. సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకోవడం, నాన్` ఐటీ రంగాలు విస్తరించడమే ఉద్యోగ నియామకాలు పెరిగేందుకు కారణమని నౌకరీ నివేదిక పేర్కొంది.

5 వార్డుల టీడీపీ ఏకగ్రీవం

అనంతపురం,అఖండ సూర్య :

అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేతులెత్తేశారు. తాడిపత్రి మున్సిపాలిటీలో టీడీపీ అధికారికంగా తన బోణీ కొట్టింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 5 వార్డులను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది.తాడిపత్రి మున్సిపాలిటీలోని 32, 33, 11, 14 , 45వ వార్డుల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎవరూ నామినేషన్లు వేయలేదు.ఈ వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, పోటీగా నిలబడేందుకు వైఎస్సార్‌సీపీ తరపున కనీసం ఒక్క అభ్యర్థి కూడా ముందుకు రాలేదు. గతంలో తాడిపత్రిలో ఏకచత్రాధిపత్యం చలాయించామని చెప్పుకునే వైసీపీకి, ఇప్పుడు కనీసం బ`ఫామ్ ఇచ్చి పోటీకి నిలబెట్టేందుకు అభ్యర్థులు కరువ్వడం చర్చనీయాంశమైంది. అభ్యర్థులు లభించకపోవడంతో నామినేషన్లు పడక ఈ ఐదు వార్డులు టీడీపీ పరమయ్యాయి. 37వ వార్డులో స్వయంగా జేసీ ప్రభాకర్ రెడ్డి కౌన్సిలర్‌గా నామినేషన్ వేశారు. ఆయనపై వైసీపీ అభ్యర్థి నిలబడ్డారు.గుంతకల్ మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులకు గానూ వైసీపీ కేవలం 8 వార్డుల్లో మాత్రమే అభ్యర్థులను నిలబెట్టుకోగలిగింది. మిగిలిన 24వార్డుల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరక్కపోవడంతో వైసీపీ పూర్తిగా చేతులెత్తేసింది. ఎమ్మెల్యే జయరాం వర్గం క్షేత్రస్థాయిలో వేసిన ఎత్తుగడలు, బూత్ స్థాయి వ్యూహాల ముందు ప్రతిపక్ష వైసీపీ కనీస పోటీ కూడా ఇవ్వలేక విఫలమైంది.ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలు నిర్ణయాలు, ఆధిపత్య ధోరణితో వ్యవహరించిన వైఎస్సార్‌సీపీకి, ఇప్పుడు అనంతపురం జిల్లా ప్రజలు, స్థానిక నేతలే గట్టి పాఠం చెప్పారనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. నామినేషన్ల దశలోనే మున్సిపాలిటీలు, వార్డుల వారీగా వైసీపీ అభ్యర్థులు కరువై మైదానం వదిలి వెళ్లడం జిల్లా ముఖ్య నేతల్ని ఆశ్చర్యానికి గురి చేస్తోంది.



ఖైరతాబాద్ లిట్మస్ టెస్ట్



హైదరాబాద్,అఖండ సూర్య :

రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు. అది మారుతూ ఉంటుంది. ప్రజాభిప్రాయం నిరంతరం గతులు మార్చుకుంటుంది. 2023లో కేసీఆర్ ఓడిపోగానే ఆయన పని అయిపోయింది అని అన్న వారు ఉన్నారు. 2024 లో లోక్ సభ ఎన్నికల్లో బీఆరఎస్ కి ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాలేదు, ఆ తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు ఎమ్మెల్యే సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆరఎస్ కి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కానీ అది నిజం కాదని తాజాగా ఖైరతాబాద్ లో ఒక ప్రముఖ సర్వే సంస్థ ఆరఆర్ నిర్వహించిన దాంట్లో తేలింది. ఇందులో విశ్లేషణలు చూస్తే కనుక బీఆరఎస్ దే మరోసారి తెలంగాణాలో అధికారం అన్నది తేలుతోంది. లిట్మస్ టెస్ట్ గా రేపు జరగబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికల ఫలితం ఉండబోతోంది అని ఈ సర్వే స్పష్టం చేసింది. తరువాత సీఎం ఆయనే : ఖైరతాబాద్ ఉప ఎన్నికల గురించి జనాభిప్రాయాన్ని ఆర్ ఆర్ సర్వే చాలా లోతుల్లోకి వెళ్ళి రాబట్టింది. దానిలో కేసీఆర్ పాలన గురించి జనాలను ప్రశ్నించిన పుడు అత్యధిక శాతం ఆయన హయాంలో బాగుంది అని చెప్పారు. అంతే కాదు 2028 లో జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అంటే కేసీఆర్ అని ఏకంగా 53.84 శాతం మంది ఓటేశారు. ఇక ప్రస్తుతం సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డికి 20.87 శాతం మద్దతు తెలిపితే బీజేపీ ఫైర్ బ్రాండ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదుపరి సీఎం అంటూ కేవలం 14.30 మంది చెప్పారు. మరో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డికి 4.39 శాతం లభించింది. ఈ సర్వే ప్రకారం చూస్తే కనుక అందరి కంటే చాలా దూరంలోనే కేసీఆర్ నిలిచి తెలంగాణా ప్రజల అభిమానం అందుకున్నారు అని అర్ధం అవుతోంది. అంతే కాదు కేసీఆర్ పరిపాలన ఉత్తమంగా ఉందని, అభివృద్ధి సంక్షేమం ఆయన హయాంలోనే బాగా జరిగాయని ఖైరతాబాద్ జనాలు బల్ల గుద్ది మరీ చెప్పారు. ఆరఆర్ సర్వే ప్రకారం చూస్తే రెండు సార్లు సీఎం గా చేసిన కేసీఆర్ కి మద్దతుగా 57.14 శాతం మంది నిలిచారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళ పాలన బాగుందని 21.97 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వడం విశేషం. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పుకుంటున్నట్లుగా తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమం పట్ల జనం అంత సంతృప్తిగా లేరు అన్నది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఒక కీలక నియోజకవర్గం. రాజకీయంగా చైతన్యవంతమైన ఖైరతాబాద్ లో ఓటర్ల మనోభావాలు తెలియచేశాయని అంటున్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎన్నికల హామీల అమలుతో సక్రమంగా పనిచేసింది అని ఆరఆర్ సర్వే ప్రకారం జనాలు కితాబు ఇస్తున్నారు. బీఆర్ ఎస్ సర్కార్ ఇచ్చిన మాట మేరకు హామీలు నెరవేర్చింది అని 54.94 శాతం మంది చెబుతూ జై కొట్టారు. అదే కాంగ్రెస్ ఎన్నికల హామీల విషయంలో అంత కచ్చితంగా అమలు చేయడం లేదన్న భావనలో జనాలు ఉన్నారనడానికి ఆ పార్టీకి 19.78 శాతం ప్రజల మద్దతు దక్కడం ఒక ఉదాహరణగా చూడాలని అంటున్నారు. లిట్మస్ టెస్ట్ అంటే అన్నంలో ఒక మెతుకుని పట్టడం లాంటిది. ఖైరతాబాద్ లో ఉప ఎన్నికలు జరగలేదు. జనం మూడ్ ఇదీ అని ఆరఆర్ సర్వే తన నివేదిక బయటపెట్టింది. దాని ప్రకారం చూస్తే అక్కడ ఉప ఎన్నికలు జరిగితే బీఆరఎస్ అభ్యర్ధి గెలుస్తారు అని 36.89 శాతం ఓటు షేర్ దక్కుతుందని ఈ సర్వే వెల్లడిస్తోంది. అదే కాంగ్రెస్ కి 34.78 శాతం ఓటు షేర్ దక్కి రెండో ప్లేస్ లో ఉంటుందని తేటతెల్లం చేసింది. ఇవన్నీ పక్కన పెడితే గత రెండున్నరేళ్ల బట్టి కేసీఆర్ అయితే జనంలో లేరు, ఆయన పెద్దగా సభలు సమావేశాలు కూడా నిర్వహించలేదు. కానీ ఆయన తదుపరి సీఎం అని జనాలు అంటున్నారు. అలాగే బీఆర్ ఎస్ హామీలు బాగా నెరవేర్చింది అని సమర్ధిస్తున్నారు.సరికొత్త రాజకీయ సరళిగా : బీఆరఎస్ పాలన బెస్ట్ అని ప్రశంసిస్తున్నారు. మరి ఎన్నికల ముందు కనుక కేసీఆర్ జనంలోకి వచ్చి ప్రచారం చేస్తే ఇంకా ఈ సానుకూలత పెరుగుతుందని అంటున్నారు. ఏది ఏమైనా ఆర్ ఆర్ సర్వే అయితే జనం నాడిని పట్టుకుంది అని అంటున్నారు. అధికార పార్టీలకు యాంటీ ఇంకెంబెన్సీ అన్నది పెరగడం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఒక సరికొత్త రాజకీయ సరళిగా ఉంది.ఒక అయిదేళ్లకు మాత్రమే ప్రభుత్వాన్ని జనాలు ఎన్నుకుంటున్నారు. రెండోసారి చాన్స్ ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు, అది తమిళనాడులో ఇటీవల ఎన్నికల్లో వెల్లడైంది. ఏపీలో పరుస మూడు ఎన్నికల్లో అలాగే జరిగింది. రేపటి ఎన్నికల్లో తెలంగాణాలో అదే జరుగుతుందా అంటే ఆరఆర్ సర్వే ప్రకారం చూస్తే అవును అన్న మాట వస్తోంది. చూదాలి మరి ఏమి జరుగుతుందో.

కర్నూలు మేయర్ పీఠం కోసం అత్తాకోడళ్ల పోటీ..



కర్నూలు, అఖండ సూర్య :

కర్నూలు రాజకీయాల్లో ఆసక్తికరమైన పోరు తెరపైకి వచ్చింది. మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో వేర్వేరు పార్టీల నుంచి బరిలోకి దిగుతున్న ఇద్దరు మహిళల మధ్య ఉన్న కుటుంబ సంబంధాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఒకరు తెలుగుదేశం పార్టీ తరపున విజయ ప్రత్యూష కాగా, మరొకరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సుశీల. బంధుత్వం ఒకవైపు.. రాజకీయ ప్రత్యర్థిత్వం మరోవైపు అన్నట్లుగా సాగుతున్న ఈ వ్యవహారం స్థానికంగా ఆసక్తిని పెంచుతోంది.సాధారణంగా ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య విమర్శలు, పోటీ సహజమే. అయితే ఒకే కుటుంబానికి చెందినవారు వేర్వేరు పార్టీల తరపున కీలక పదవుల కోసం పోటీ పడితే ఆ రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారతాయి. కర్నూలు మేయర్ పదవికి సంబంధించి ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కుటుంబంలో అత్తాకోడళ్ల వరుసలో ఉన్న ఇద్దరు మహిళలు రాజకీయంగా ఒకరికొకరు ఎదురుగా నిలవడం ఈ పోటీకి ప్రత్యేకతను తీసుకొచ్చింది.తెలుగుదేశం పార్టీ తరపున ముందుకు వస్తున్న బొల్లెద్దుల విజయ ప్రత్యూషకు గతంలో 52వ వార్డు కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లెద్దుల రామకృష్ణ కుమార్తె. స్థానిక రాజకీయాలపై అవగాహన, గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకు అనుకూలంగా మారుతాయని ఆమె వర్గం భావిస్తోంది. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మద్దతు, పార్టీ అధిష్ఠానం ఆశీస్సులు కూడా తన రాజకీయ ప్రయాణానికి బలాన్నిస్తాయని విజయ ప్రత్యూష అనుచరులు ఆశిస్తున్నారు.మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సుశీల పేరు చర్చలో ఉంది. ఆమెకు మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ కుటుంబంతో సంబంధాలు ఉండటంతో పాటు, పార్టీ శ్రేణుల మద్దతు తనకు కలిసివస్తుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానికంగా పార్టీకి ఉన్న బలం, నాయకుల సహకారం మేయర్ పదవిని దక్కించుకునే ప్రయత్నంలో కీలకంగా మారవచ్చు. దీంతో ఇరువర్గాల మధ్య పోటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఇద్దరి మధ్య ఉన్న బంధుత్వమే ఈ వ్యవహారంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. సుశీల కుమారుడిని విజయ ప్రత్యూష సోదరి వివాహం చేసుకుంది. ఈ సంబంధం కారణంగా వీరిద్దరూ అత్తాకోడళ్ల వరుసలోకి వస్తారు. కుటుంబ వేడుకల్లో కలుసుకునే వీరు రాజకీయ వేదికపై ప్రత్యర్థులుగా నిలవాల్సిన పరిస్థితి రావడం స్థానికంగా చర్చలకు దారితీస్తోంది. అయితే మేయర్ పదవిని ఎవరు దక్కించుకుంటారనేది కేవలం కుటుంబ నేపథ్యం లేదా వ్యక్తిగత పరిచయాలపై ఆధారపడి ఉండదు. పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు, రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమీకరణాలు వంటి అనేక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి.

టీడీపీ నుంచి ప్రత్యూష.. వైసీపీ నుంచి సుశీల

కర్నూలు మేయర్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో టీడీపీ తరపున బొల్లెద్దుల ప్రత్యూష, వైసీపీ తరపున ఉతకల్ల సుశీల పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య రాజకీయ ప్రత్యర్థిత్వం ఉన్నప్పటికీ, కుటుంబ పరంగా దగ్గరి సంబంధం ఉంది. ప్రత్యూష సోదరి ప్రియాంకను సుశీల కుమారుడు భార్గవ్ వివాహం చేసుకున్నారు. ఈ బంధం కారణంగా సుశీల, ప్రత్యూషకు అత్త అవుతారు. ఇప్పుడు ఒకే కుటుంబానికి చెందిన ఈ ఇద్దరు మహిళలు మేయర్ పీఠం కోసం పోటీ పడుతుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది.ఉతకల్ల సుశీల కుటుంబానికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమె భర్త మణి గాంధీ గతంలో కోడుమూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. సుశీల మామ శిఖామణి కూడా కోడుమూరు నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో సుశీలకు రాజకీయ కుటుంబ నేపథ్యం బలంగా ఉంది. మరోవైపు, బొల్లెద్దుల ప్రత్యూష కూడా రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకురాలే. కర్నూలు 51వ డివిజన్ నుంచి గత ఐదేళ్లపాటు కార్పొరేటర్‌గా పనిచేశారు. ఆమె తండ్రి రామకృష్ణ మంత్రి టీజీ భరత్‌కు అనుచరుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి మద్దతుతో ప్రత్యూషకు మేయర్ అభ్యర్థిగా అవకాశం లభించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అత్త గెలుస్తుందా? కోడలు విజయం సాధిస్తుందా?

ఒకవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ.. రెండు పార్టీల మధ్య పోటీకి కుటుంబ బంధం మరింత ఆసక్తిని జోడిస్తోంది. రాజకీయ అనుభవం, పార్టీ బలం, కార్పొరేటర్ల మద్దతు వంటి అంశాలు ఫలితాన్ని ప్రభావితం చేయనున్నాయి. చివరకు అత్త సుశీల విజయం సాధిస్తారా? లేక కోడలు ప్రత్యూష మేయర్ పీఠాన్ని దక్కించుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. కర్నూలు మేయర్ ఎన్నికల ఫలితం కోసం రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. ప్రజా సమస్యలపై అవగాహన, అభివృద్ధి కార్యక్రమాలపై స్పష్టత కూడా నాయకుల రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేయగలవు.కర్నూలు నగర ప్రజలకు ఈ పోటీ ఆసక్తికరంగా కనిపిస్తున్నప్పటికీ, చివరకు మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది రాజకీయ పరిణామాలపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబ బంధాలు ఎన్నికల పోటీని ఎంతవరకు ప్రభావితం చేస్తాయి? పార్టీ విధేయతకు ఓటర్లు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? ఈ ప్రశ్నలకు రాబోయే పరిణామాలు సమాధానం చెప్పనున్నాయి. అత్తాకోడళ్లుగా బంధుత్వం కలిగిన ఈ ఇద్దరు మహిళల రాజకీయ పోటీ కర్నూలు రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందో వేచి చూడాలి.

రాత్రికి రాత్రే పార్టీ మార్పు.. వైసీపీ కండువా!

పెనుకొండ,అఖండ సూర్య :

రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.. పదవి కోసం పార్టీలు మారడం, రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోవడం సర్వసాధారణం. తాజాగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో చోటుచేసుకున్న పరిణామం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. నిన్నటి వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగిన ఓ నాయకుడు.. టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారి, ఏకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది.పెనుకొండకు చెందిన బోయ శ్రీనివాసులు అలియాస్ జంపు శ్రీను గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. సుమారు మూడు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగుతున్న ఆయన.. పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ తరపున టికెట్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ, చివరకు ఆయనకు నిరాశ ఎదురైంది.పెనుకొండ మున్సిపల్ చైర్మన్ టీడీపీ అభ్యర్థిగా త్రివేంద్రమూర్తి పేరును ప్రకటించడంతో జంపు శ్రీను అసంతృప్తికి గురయ్యారు. పార్టీలో ఇన్నేళ్లుగా కొనసాగినా తగిన గుర్తింపు, గౌరవం లభించలేదనే భావనతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.టీడీపీలో చైర్మన్ టికెట్ దక్కకపోవడంతో జంపు శ్రీను వైసీపీ నేతలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అనంతరం మాజీ మంత్రి ఉషశ్రీ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మారడమే కాకుండా, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూడా ఆయన తెరపైకి రావడం స్థానిక రాజకీయాల్లో అనూహ్య పరిణామంగా మారింది. నిన్నటి వరకు టీడీపీలో చైర్మన్ టికెట్ కోసం ప్రయత్నించిన నాయకుడు.. నేడు అదే పదవి కోసం వైసీపీ తరపున పోటీకి సిద్ధమవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జంపు శ్రీను పార్టీ మార్పుతో పెనుకొండ మున్సిపల్ చైర్మన్ పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. టికెట్ కేటాయింపులు, వ్యక్తిగత రాజకీయ ఆశయాలు, పార్టీ నాయకత్వ నిర్ణయాలు స్థానిక రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ మొదలైంది. అయితే, ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. నిన్న ఒక పార్టీ నాయకుడు.. నేడు మరో పార్టీ చైర్మన్ అభ్యర్థి! పెనుకొండలో చోటుచేసుకున్న ఈ రాజకీయ మలుపు మరోసారి రాజకీయాల్లో ఏదైనా సాధ్యమేనని చాటుతోంది.




అహోబిలంలో భారీ అగ్నిప్రమాదం

- **షార్ట్ సర్క్యూట్‌తో రెండు హోటళ్లు, నాలుగు బొమ్మల దుకాణాలు దగ్ధం**
- **ప్రాణాలకు తెగించి ఐదుగురిని కాపాడిన పోలీసులు నాలుగు గ్యాస్ సిలిండర్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చినవైనం.**

అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి.,

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అహోబిలం దేవస్థానం పరిధిలో బీగాల ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న రెండు హోటళ్లు, నాలుగు బొమ్మల దుకాణాలు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలకు ఆహుతైనట్లు సమాచారం. ఈ ఘటనలో భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. సాహసోపేతంగా ప్రాణాలు కాపాడిన పోలీసులు అగ్నిప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో నిద్రిస్తున్న ఐదుగురిని పోలీసులు సాహసోపేతంగా రక్షించారు. అంతేకాకుండా ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నాలుగు గ్యాస్ సిలిండర్లను రిస్క్ ఆపరేషన్ నిర్వహించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. పోలీసుల సాహసానికి గ్రామస్తుల అభినందనలు తెలిపారు. అర్ధరాత్రి వేళ ప్రమాదకర పరిస్థితుల్లోనూ ప్రాణాలను లెక్కచేయకుండా ఐదుగురిని రక్షించి, గ్యాస్ సిలిండర్లను బయటకు తీసుకొచ్చిన పోలీసుల సాహసాన్ని గ్రామప్రజలు అభినందించారు. పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో మరింత ప్రమాదం జరగకుండా నివారించగలిగారని స్థానికులు ప్రశంసించారు. ఈ అగ్నిప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆస్తి నష్టం అంచనా తదితర వివరాలు తెలియాల్సి ఉంది.





ఇసుక పల్లి గ్రామం లో20 కుటుంబాలు టిడిపి నుండి గంగుల ప్రభాకర రెడ్డి సమక్షంలో వైయస్సార్. సి.పి. లో చేరిక

అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి

ఆళ్ళగడ్డ వైఎస్ఆర్ కాంగ్రెస్స్ పార్టీ కార్యాలయము నందు కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి ,మాజీ శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డిల సమక్షంలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోనిశిరివెళ్ల మండలం, ఇసుకపల్లే గ్రామస్తులు నిమ్మకాలయాల శ్రీనివాస రెడ్డి, మేకలవెంకట నారాయణ, సారెడ్డి బలిరెడ్డి ,సారెడ్డి తిమ్మారెడ్డి తో పాటు 10 కుటుంబాలు టిడిపి నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్స్ పార్టీలో సోమవారము చేరారు. వీరికి సాదరంగా ఆహ్వానం పలికి వైఎస్ఆర్‌సిపి కండువా కప్పి పార్టీలోకి కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో శిరివెళ్ల మండల వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు ఇందూరి ప్రతాప్ రెడ్డి , గ్రామ నాయకులు పాల్గొన్నారు.







ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- **పోటీ చేయు అభ్యర్థులు గమనించాల్సిన అంశాలు**

అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి...

ఈ నెల 21తేది నుండి 23 వ తేది వరకు ఆయా మండలాల ఎంపిడి,ఓ. కార్యాలయం నందు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని ఎన్నికల అధికారులు తెలిపారు.24 వతేది నామినేషన్ల పరిశీలన (స్క్రూటీనిఆఫ్ నామినేషన్స్) ఉంటుందన్నారు. 25 న నామినేషన్ ఫారంలో ఏమైనా తప్పిదాలు జరిగి తిరస్కరించిన నామినేషన్లపై అప్పిలు చేసుకోవచ్చునని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.
26వ తేది ఎన్నికల అధికారి తిరస్కరణ నామినేషన్ల పై తుది నిర. 27.10.2026 తేది నామినేషన్ల ఉపసంహరణ కు అవకాశము. 27వ తేది సాయంత్రం ఎన్నికల అధికారిచే ఎంపిటీసి,జడ్పీటీసీ పదవులకు పోటీ చేయు అభ్యర్థుల పేర్లు నోటీస్ బోర్డులో ప్రకటన చేయటం జరుగుతుందన్నారు. వచ్చేనవంబర్ నెల 3 వతేదీన,ఓటర్లపోలింగ్ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.4వతేదిన అవసరమైన చోట ఎన్నికల అధికారి అనుమతితో రీపోలింగ్ నిర్వహిస్తారని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.అదేవిధంగా 5వ తేదిన ఎంపిటీసి, జడ్పీటీసి ఓట్ల లెక్కింపు,... ఆ వెంటనే ఫలితాల ప్రకటన గెలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి చే ధృవీకరణ పత్రం అందజేస్తామని ఎన్నికల అధికారులు వివరించారు.

ఆళ్లగడ్డలో మూగ జీవాల పట్లమానవత్వం చాటుకున్న ఈపనగండ్ల శ్రీనివాస్ యాదవ్

- **వీధికుక్కకు క్యాన్సర్ చికిత్స,ఆవుదుడకు శస్త్రచికిత్స**

అఖండసూర్యఆళ్లగడ్డ ప్రతినిధి



ఆళ్లగడ్డ పడకల బ్రిడ్జిదగ్గర వీధి కుక్కకు రొమ్ము క్యాన్సర్ గడ్డను సర్జరీచేయించి తొలగించడం జరిగిందని,అనిమల్ బోర్డు వైస్ ప్రసిడెంట్ ఈపనగండ్ల శ్రీనివాస్ యాదవ్,తెలిపారు. వీధి కుక్కకు క్యాన్సర్ గడ్డను తొలగించే కార్యక్రమానికి సహకరించినటువంటి అనిమల్ లవర్ మాధవి గారికి ,అలాగే డాక్టర్ సాయిబాబా గారికి వారికి సహకారం వచ్చినటువంటి వారి మిత్రునికి ఆయన కృతజ్ఞతలు తెలియ అలాగే జేశారు.సంత మార్కెట్లో నాలుగు నెలల ఆవు దూడను గుర్తుతెలియని వాహనం రెండు మూడు రోజుల కిందట యాక్సిడెంట్ చేసినందన్నారు .నా దృష్టికి సోమవారం రాగా ఆటోలో,ఆళ్లగడ్డ అనిమల్ హాస్పిటల్ తీసుకెళ్లి పురుగులను తొలగించి కట్టుకట్టించి సంత మార్కెట్లో వదిలివేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆవుదూడ యజమాని దయచేసి వారి ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయించి ఆకాలును నయం చేయించు కోవాల్సిందిగా మీడియా ముఖంగా యజమానికి తాను కోరుతున్నానన్నారు. ప్రజలఆవుదూడకు కట్టు కట్టించేందుకునాతోపాటుమా అటెండర్ మద్దిలేటినాకుసహకరించడం జరిగిందని తెలిపారు. ఆటోపుల్లయ్యకుకూడా ధన్యవాదాలు అనిమల్ బోర్డ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్. ఈపన గండ్ల శ్రీనివాస్ యాదవ్ తెలియజేశారు.





అహోబిలం క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు తిరుమంజనం ఉత్సవం

అఖండ సూర్య ఆళ్ళగడ్డ ప్రతినిధి

దేశంలోని 108 దివ్య క్షేత్రాలలో ఒకటైన అహోబిలం శ్రీ ప్రహ్లాద వరద సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగాసోమవారం నాడు శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం ఉత్సవంనుఆలయప్రధాన అర్చకులు కీడాంబివేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు అత్యంత వైభవంగా కన్నులపండువగానిర్వహించారు.ఈ ఉత్సవాలభక్తులుఅధికసంఖ్యలోస్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు .ఈ ఉత్సవ కార్యక్రమంలోఅహోబిలం దేవస్థానం సి.ఏ.ఓ.మాధవన్, ఆలయమణియార్ సౌమ్య నారాయణ్,ఆలయఅర్చకస్వాములతోపాటు అలయ సిబ్బంది, భక్తులుపదధ ఎత్తున పాల్గొన్నారు.



అనంతరంతిరు వీధులలోగ్రామోత్సవం నిర్వహించారు.





ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

- **ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ వెంకటరమణ**

అఖండ సూర్య, గూడూరు:

గర్భిణీ స్త్రీలందరూ ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేసుకోవాలని ఆ దిశగా వైద్య సిబ్బంది ఆ అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రమణ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆయన పరిశీలించారు. అనంతరం మందుల విభాగాన్ని, రక్త పరీక్షల ల్యాబ్, రికార్డ్స్ రిపోర్ట్స్ రిజిస్టర్ ను తనిఖీ చేసి వైద్యులకు సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బందితో సమన్వయంతో పనిచేసి ప్రజల్లో వైద్య చికిత్సలపై నమ్మకం పెంచాలని మాత శిశు సంరక్షణ టీకాలు అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ లో రోజువారీగా నమోదు చేయాలని మాతృ శిశు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చిన్న పిల్లలకు ఇస్తున్న సార్వత్రిక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించామన్నారు. ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని ఇబ్బందికరంగా ఉన్న గర్భిణీలను జిల్లా ఆస్పత్రికి తరలించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ మరియు లెప్రసి ఎయిడ్స్ డాక్టర్ భాస్కర్, సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వర్ రెడ్డి, వైద్యులు డాక్టర్ రాజకిరీటి, ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.





20వ వార్డు టిడిపి కౌన్సిలర్ గా సులేమాన్

అఖండ సూర్య, గూడూరు:

గూడూరు నగర పంచాయతీలోని 20వ వార్డు టిడిపి కౌన్సిలర్ గా నామినేషన్ వేసిన సులేమాన్ సోమవారం ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. పడమర బిసి కాలనీలో నివాసం ఉంటున్న సులేమాన్ గత 20 ఏళ్లుగా టిడిపి పార్టీలో కొనసాగుతూ సేవలను అందిస్తున్నాని,ప్రజలకు సేవ చేసేందుకు గా ను కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకుగాను కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న అని ప్రజలందరూ తనకు అండగా ఉండి మద్దతు తెలిపి గెలిపించాలని సులేమాన్ కోరారు.





ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల స్క్రూటినినిపరిశీలించిన భూమాజగత్ విఖ్యాత రెడ్డి

అఖండసూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారంనాడు కౌన్సిలర్ అభ్యర్థుల స్క్రూటినిని మున్సిపల్ ఆఫీస్ వెళ్లి ఆళ్లగడ్డ టిడిపి యువ నాయకుడు భూమాజగత్ విఖ్యాత రెడ్డి స్క్రూ పరిశీలించారు. భూమాజగత్ విఖ్యాత్ రెడ్డితో పాటుటిడిపినాయకులు,భూమా అభిమానులు పాల్గొన్నారు.





ఆళ్లగడ్డ బస్టాండ్ లో బహిరంగ మూత్ర విసర్జన చేస్తే కఠిన చర్యలు

- **డి.యం.సుబ్రమణ్యం**

అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి



ఆళ్లగడ్డ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బహిరంగ మూత్ర విసర్జన చేసినా, స్కూటర్ స్టాండ్ లో కాకుండా అనధికారికంగావాహనాలను పార్కింగ్ చేసినా అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని డిపోమేనేజర్ సుబ్రహ్మణ్యంహెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ,.ఇటీవల ఆళ్లగడ్డ డిపో తనిఖీకి వచ్చిన మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బస్టాండ్ ఆవరణలో ఇకపై బహిరంగ మూత్ర విసర్జన చేసిన వారిపై జరిమానావిధించి కఠినచర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ సుబ్రమణ్యంసృష్టం చేశారు. ఆళ్లగడ్డ ప్రాంతం ప్రయాణికులు ప్రజలు, సహకరించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు...

హెల్మెట్ ధరించుకుందాం...
ప్రాణాలు కాపాడుకుందాం

- **వాహనాల పత్రాలు ఇంటి దగ్గర ఉన్నాయని చెప్పడం భాద్యరాహిత్యం.**
- **ట్రాఫిక్ నిబంధనలను పాట్టిదాం.**
- **ప్రమాదలను నివారిద్దాం**
- **ఎస్ఐ బాబురావు**

అఖండ సూర్య న్యూస్ ప్రతినిధి
త్రిపురాంతకం :

ద్విచక్ర వాహనాలను నడిపే వారు కచ్చితంగా హెల్మెట్‌లను ధరించాలని ఎస్ ఐ బాబురావు తెలిపారు.మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్‌లు లేకుండా ద్విచక్ర వాహనాల నడిపేవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్ఐ బాబురావు మాట్లాడుతూ కొంతమంది వాహనదారులు హెల్మెట్ ఉన్నా ఇంటి వద్ద పెట్టివచ్చామంటు బుకాయింపులు చేయడం మానుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేయడమే కాకుండా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆటోలను నడిపేవారు సామార్థ్యానికి మించి ప్రయాణికులను చేరవేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు

- **సభ్యురాలిగా మంత్రి సీతక్క నియామకం**
- **గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర సమీక్షలు.. జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం**

ములుగు , అఖండ సూర్య





రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సిఫారసు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దా. దనసరి అనసూయ సీతక్క సభ్యురాలిగా నియమితులయ్యారు.ఈ మేరకు ప్రభుత్వం జీఓ ఆర్టీ నంబర్ 1523ను జారీ చేసింది.
గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మంత్రి సీతక్క అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరా, నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తాగునీటి భద్రతతో పాటు జల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కీలకంగా వ్యవహరిస్తోంది. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు, పంట గుంతలు, ఊట కుంటల నిర్మాణం, నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తోంది. నీటి వనరులను సంరక్షించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భవిష్యత్తులో తాగునీటి కొరతను తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది.
గ్రామీణ ప్రాంతాల్లో వేసవికి ముందే నీటి సమస్యలను గుర్తించి పరిష్కరించడం, అందుబాటులో ఉన్ననీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడటంలో శాఖ సమన్వయంతో పనిచేస్తోంది.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చైర్మన్‌గా వ్యవహరించే ఈ కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి సీతక్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి, సంబంధిత శాఖలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు తదుపరి చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత.

నీట్‌లో ర్యాంకు సాధించిన
దుర్గ భవానికి సన్మానం

- **ప్రతి ఉత్తమ విద్యార్థికి కలం ఫౌండేషన్ ప్రోత్సహిస్తుంది**
- **కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్వర్ అహ్మద్**


వెంకటాపూర్, అఖండ సూర్య

నీటిలో ర్యాంకు సాధించిన దుర్గ భవాని నికలం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామానికి చెందిన అంతర్గం రమేష్ మాలతి దంపతుల కూతురు దుర్గ భవాని ఇటీవల నిర్వహించిన నీటిలో ఉత్తమ ర్యాంకు సాధించారు. దుర్గ భవాని మొదటి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యనభ్యనిసించారు. దుర్గ భవాని తండ్రి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటినుండి దుర్గ భవాని యొక్క బాబాయి అంతరగాం సుమన్ హైదరాబాదులో ఇండస్ట్రీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ గాను, అన్న యొక్క కూతురు, కుమారుడిని ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అన్న కూతురు ఎలాగైనా డాక్టర్ చేయాలని సంకల్పంతో ఆర్థిక పెట్టుబడులు పెట్టి ముందుకు తీసుకెళ్లారు. ఇటీవల జరిగిన నీటి పరీక్షల్లో దుర్గ భవాని ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ నర్సంపేటలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా కలం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ సర్వర్ అహ్మద్ ఆధ్వర్యంలో మెడికల్ సీటు సాధించిన దుర్గ భవానిని, వారి అమ్మ మాలతిని,వారి బాబాయ్ సుమను, వారి నానమ్మ గౌరమ్మలను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా నేతకాని కుల సంఘం నాయకులు గోగు రాజయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం సర్వర్ అహ్మద్ మాట్లాడారు. డాక్టర్ అయిన తర్వాత లక్ష్మీదేవి పేట గ్రామానికి సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జెన్కో కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదవ్, సీనియర్ జర్నలిస్టులు నల్లబెల్లి సాంబయ్య పటేల్, రంగిశెట్టి రాజేందర్ కేతిరి బిక్షపతి చిన్న కుమార్ నాయకులు కొత్తపెల్లి ఆనందం రేగులపాటి అశోక్ జైపాల్ రెడ్డి ఏశాల శ్రీనివాస్ ఆసిఫ్ చిర్రా గణేష్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ అమ్మవారిశాలలో శ్రీ దుర్గాదేవి అలంకారంలో
భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవీ మాత..

అఖండ సూర్య ఆళ్లగడ్డ ప్రతినిధి



ఆళ్లగడ్డ పట్టణము లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలోసోమవారం శ్రీ దుర్గా దేవి అలంకారంలోశ్రీ వాసవీమాత భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిమూల విరాట్ కు అభిషేకంచేసి అనంతరం వివిధరకాల పూలమాలలతో, బంగారుఆభరణాలతో ఆలయప్రధాన అర్చకులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అలంకరించివిశేష పూజలు, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు.భక్తులు అమ్మ వారినిదర్శించుకున్నారు.వేదపండితులుదసరా నవరాత్రి ఉత్సవాలలోభాగంగాచండిహోమం, మహా పూర్ణాహుతి కార్య క్రమంను నిర్వహించారు.రాత్రి కి శ్రీ దుర్గాదేవిఅలంకారంలో అమ్మ వారుభక్తులకు దర్శనం ఇవ్వటం జరిగింది.ఈ కార్య క్రమంలోఆళ్లగడ్డఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవి శెట్టి హరీష్ బాబు, కార్య నిర్వాహక అధ్యక్షుడు బైసానిరవి ప్రకాష్ తోపాటు కమిటిసభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణ ప్రజలు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు .



ములుగు జిల్లా ప్రజలకు
దసరా పండుగ శుభాకాంక్షలు

- **విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు**
- **కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు సిద్ధం రాఘవేంద్రరావు**

ములుగు, అఖండ సూర్య



విజయానికి, ధర్మానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి దసరా పండుగను పురస్కరించుకొని ములుగు జిల్లా ప్రజలు దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు సిద్ధం రాఘవేందర్రావు కోరారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ములుగు జిల్లా ప్రజలు మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ల ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉన్నారని ఆయన తెలిపారు. సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన ప్రజలకు హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు, నిరుపేదల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు. సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, పరస్పర గౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, అభివృద్ధి, ఆనందం వెల్లివిరియాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.
ప్రజలందరికీ ఆయన
విజయదశమి శుభాకాంక్షలు!

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు.

అఖండ సూర్య పెద్దపల్లి

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ (గొల్లపల్లి) గ్రామంలో 10 లక్షల రూపాయల నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణం కోసం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్లు, కౌన్సిలర్లు మరియు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు. పెద్దపల్లి పట్టణంలోని బాబా రాందేవ్ మందిరంలో శ్రీ. దుర్గాభవానీ ఆలయంలో దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. అనంతరం పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిను ప్రభుత్వ విప్ విజయరమణ రావు దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







చెరకు రైతుల ఆందోళనలు

మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కర్ణాటక ముఖ్య మంత్రి డీకే శివకుమార్ తెలిపారు. సమస్య పరిష్కా రానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. చక్కెర మద్దతు ధర పెంపుతోపాటు ఇథనాల్ ధరలు, కొనుగోలు విధానం, చెరకు ధరల నిర్ణయానికి సంబంధించిన అంశాలను లేఖలో ప్రస్తావించారు.

ఆందోళనలతో నిలిచిన క్రషింగ్

ఉత్తర కర్ణాటకలో చెరకు రైతులు తమ డిమాండ్ల సాధన కోసం నిరసనలు కొనసాగిస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసాన్ని ముట్టడించేందుకు రైతులు పాదయాత్రలు చేపట్టడంతోపాటు రహదా రులను దిగ్బంధిస్తున్నారు. దీంతో ప్రజా రవాణా, రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవు తున్నాయని సీఎం పేర్కొన్నారు. మరోవైపు చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడంతో పంటను సకాలంలో వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిం దని వివరించారు. సమస్య మరింత ముదరకుండా కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

చక్కెర మద్దతు ధర పెంచాలి

చక్కెర కనీస విక్రయ ధరను 2019 ఫిబ్రవరిలో కిలోకు రూ.31గా నిర్ణయించారని, అప్పటి నుంచి దానిని పెంచలేదని డీకే శివకుమార్ లేఖలో పే ర్కొన్నారు. ఇదే సమయంలో చెరకు ధర టన్నుకు రూ.2,750 నుంచి రూ.3,650కు పెరిగిందని గు ర్తుచేశారు. చెరకు కొనుగోలు వ్యయం పెరుగుతున్న ప్పటికీ చక్కెర విక్రయ ధరలో మార్పు లేకపోవడంతో మిల్లులపై ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు గిట్టుబాటు ధర చెల్లించ డం కష్టమవుతోందని, చక్కెర కనీస విక్రయ ధరను వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు.

వినియోగదారులకు భారం పడకుండా..

చక్కెర ధరల విషయంలో గృహ వినియోగదారులు, భారీ స్థాయిలో కొనుగోలు చేసే వాణిజ్య సంస్థల అవసరాలను వేర్వేరుగా పరిగణించాలని సీఎం సూచించారు. సాధారణ ప్రజలపై అదనపు భారం పడకుండా చూడటంతోపాటు, వాణిజ్య కొనుగోలుదా రుల నుంచి మిల్లులకు తగిన ఆదాయం లభించేలా ధరల విధానాన్ని రూపొందించాలని కోరారు. దీనివల్ల మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతోపాటు చెరకు రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇథనాల్ కొనుగోలు విధానంపై అభ్యంతరం

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇటీవల ప్రకటించిన ఇథనాల్ కొనుగోలు టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్ ద్వారా తయారయ్యే ఇథనాల్‌ను మినహాయించడంపై డీకే శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానం చక్కెర మిల్లుల ఆదాయాన్ని తగ్గించి, రైతులకు చెరకు బకాయిల చెల్లింపులపై ప్రభావం చూపుతుందని ఆందోళన తెలిపారు. టెండర్ల నిబం ధనలను సమీక్షించి, చెరకు ఆధారిత ఇథనాల్‌కూ తగిన అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరారు.

ఇథనాల్ ధరలూ సవరించాలి

చెరకు సరఫరాకు సంబంధించిన న్యాయమైన, లాభదాయక ధర (ఎఫ్ఆర్‌పీ) పెరుగుతున్నప్పటికీ చెరకు రసం ద్వారా తయారు చేసే ఇథనాల్ ధరలు 2022-23 నుంచి పెరగలేదని సీఎం పేర్కొన్నారు. ధాన్య ఆధారిత ఇథనాల్ ధరలను పెంచినట్లుగానే చెరకు ఆధారిత ఇథనాల్ ధరలను కూడా సవరించా లని సూచించారు. ఇథనాల్ విక్రయాల ద్వారా మి ల్లులకు తగిన ఆదాయం వస్తే రైతులకు చెల్లింపులు చేయడం సులభమవుతుందని వివరించారు.

రికవరీ ప్రాతిపదికను తగ్గించాలి

చెరకు నుంచి ఎంత శాతం చక్కెర ఉత్పత్తి అవుతుంద నే అంశాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు చెల్లించే ధరను నిర్ణయిస్తారు. చక్కెర రికవరీ ప్రాతిపదికను 10.25 శాతానికి పెంచడం వల్ల తక్కువ రికవరీ నమోదయ్యే ప్రాంతాల్లోని రైతులకు పూర్తి ఎఫ్ఆ ర్‌పీ అందడం లేదని డీకే శివకుమార్ పేర్కొన్నారు. గతంలో ఉన్న విధానం ప్రకారం రికవరీ ప్రాతిపది కను తిరిగి 9.50 శాతానికి తగ్గించాలని కోరారు. దీనివల్ల ప్రాంతాలవారీగా రికవరీలో తేడాలున్నా రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.290 కోట్లు

రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకుందని సీఎం లేఖలో వివరించారు. చక్కెర మిల్లుల్లో డిజిటల్ తూకం వ్యవస్థ, ప్రయోగశాలల గుర్తింపు వంటి అంశాలపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరకు టన్నుకు అదనంగా రూ.100 చొప్పున చెల్లించే విధానంలో భాగంగా రైతులకు రూ.290 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో టన్నుకు రూ.50 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని వివ రించారు.

కేంద్రం నిర్ణయంపైనే ఆశలు

చెరకు ధరలు, చక్కెర కనీస విక్రయ ధర, ఇథనాల్ కొనుగోలు విధానం వంటి ప్రధాన అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని డీకే శివకుమార్ పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా చర్యలు తీసుకు న్నప్పటికీ, రైతుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం నిర్ణయం అవసరమని స్పష్టం చేశారు. రైతుల ఆందోళనలు కొనసాగకుండా, పంట నష్టపోకుండా, చక్కెర మిల్లుల్లో క్రషింగ్ తిరిగి ప్రారంభమయ్యేలా ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే జోక్యం చేసుకోవా లని కోరారు.



అమలాపురంలో చలాన్ల వివాదం

- **టీడీపీ, వైసీపీ నేతల మధ్య తోపులాట**
- **నామినేషన్ల పరిశీలనలో ఇరుపార్టీల మధ్య వివాదం**

అఖండసూర్య, కోనసీమ :

అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో నామినే షన్ల పరిశీలన సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుం ది. చలాన్ల బకాయిల అంశంపై టీడీపీ, వైసీపీ నేతల మధ్య వివాదం తలెత్తింది. ఇరువర్గాల నాయకులు పరస్పరం వాదనలకు దిగడంతో కార్యాలయంలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో తోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు.

15వ వార్డు నామినేషన్లపై వివాదం

అమలాపురం మున్సిపాలిటీలోని 15వ వార్డు నామినే షన్ల పరిశీలన సందర్భంగా ఈ వివాదం మొదలైంది. టీడీపీ అభ్యర్థికి రూ.1,000 బైక్ చలాన్ పెండింగ్‌లో ఉందని పేర్కొంటూ, ఆయన నామినేషన్‌ను తిరస్క రించాలని వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. దీంతో ఇరుపార్టీల నేతల మధ్య వాదోపవా దాలు మొదలయ్యాయి.

రూ.61 వేల బకాయిలపై టీడీపీ అభ్యంతరం

వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్‌కు మున్సిపాలిటీకి సంబంధించి రూ.61 వేల బకాయిలు ఉన్నాయని టీడీపీ నేతలు ఆరోపించారు. ఆ బకాయిల నేపథ్యం లో ఆయన నామినేషన్‌ను కూడా తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో చలాన్ల అంశం ఇరుపార్టీల మధ్య రాజకీయ వివాదంగా మారింది. నామినేషన్ల పరిశీలన జరుగుతున్న సమ యంలోనే ఇరువర్గాల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత

బైక్ చలాన్లు, మున్సిపల్ బకాయిల అంశంపై ఇరు పార్టీల నేతలు ఒకరిపై మరొకరు కేకలు వేస్తూ వా గ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తోపులాట కూడా చోటుచేసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో ఒక్క సారిగా గందరగోళం నెలకొనడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఇరువర్గాల నేతలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.

బయటి చలాన్లతో సంబంధం లేదన్న సిబ్బంది

మున్సిపాలిటీకి చెల్లించాల్సిన బకాయిలకు, ఇతర శాఖలకు సంబంధించిన చలాన్లకు మధ్య తేడా ఉందని మున్సిపల్ సిబ్బంది స్పష్టం చేశారు. మున్సి పాలిటీకి సంబంధం లేని బయటి చలాన్ల విషయంలో కార్యాలయానికి సంబంధం లేదని తేల్చిచెప్పారు. అయినప్పటికీ ఇరుపార్టీల నేతలు తమ వాదనలకు పట్టుబట్టడంతో వివాదం కొనసాగింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పరిశీలన సమయంలో అభ్యర్థుల అర్హతలు, బకాయిల అంశాలపై ఇరుపా ర్టీల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. అమలాపు రంలో చలాన్ల వ్యవహారం తోపులాటకు దారితీయ డంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.



34 నెలల్లో 12.40 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు

మొదటిపేజీ తరువాయి

తర్వాత 5,68,858 పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. భూములపై హక్కులకు సంబంధించి రైతులు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

ఠీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను ఠీసర్వే ద్వారా పరిష్కరించే అవకాశం ఉందని పొంగులేటి పేర్కొన్నారు. భూములను సాగు చేస్తున్నవారిని గుర్తించి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అర్హులైన రైతులకు భూమిపై హక్కులు దక్కేలా రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.

నారాయణపురంలో 906 మందికి హక్కులు

భూ హక్కుల కల్పనలో భాగంగా నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారా నికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది ఉదాహరణగా నిలుస్తుందని వివరించారు. భూములను సాగు చేస్తున్న రైతులకు హక్కులు కల్పించడంలో జాప్యం జరగకూడదని అధికారులకు సూచించారు.

సూర్యాపేటలో 2,400 మందికి పట్టాలు

సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించినట్లు పొంగులేటి తెలిపారు. భూ హక్కులు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నరైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

మూడు జిల్లాల్లో ఠీ-సర్వే వేగవంతం

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భూముల ఠీసర్వే పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి వివరించారు. ఈ ప్ర క్రియను సమర్థంగా పూర్తి చేసి, భూ హక్కుల కోసం ఎదురుచూ స్తున్నరైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడం, వివాదాలకు తావులేకుం డా చూడటం, అర్హులైన సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాలని పేర్కొన్నారు.

ఎల్‌నినోపై ప్రత్యేక కమిటీ

మొదటిపేజీ తరువాయి



కమిటీ సమీక్షించనుంది. కరువు పరిస్థితులు తీవ్రం కాకముందే తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్త కుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించ నుంది. నీటి లభ్యత, సరఫరా పరిస్థితులను ఎప్ప టికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలపై దృష్టి సారించనుంది.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభు త్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణంపై ప్రత్యేకం గా దృష్టి పెట్టనున్నారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాల మట్టాలను పెంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. వేసవి ప్రా రంభమయ్యేలోగా నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామా లను గుర్తించి, సమస్య పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ఎల్‌నినో ప్రభావంపై పరిస్థి తులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వాని కి కమిటీ నివేదికలు, సిఫార్సులు అందించనుంది.

సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సమీక్ష

మరోవైపు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియో గాన్ని వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్‌ప్లాన్ అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల ఖర్చులో జాప్యం జరగకూడ దని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

బడ్జెట్ ఖర్చుపై నిరంతర పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన పథకాల అమలులో నిధులు సకాలంలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని భట్టి సూచించారు. రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొం దించాలని అధికారులకు తెలిపారు. బడ్జెట్ కేటా యింపులు, ఇప్పటివరకు చేసిన ఖర్చు, మిగిలిన నిధుల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించాలి

- **కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత**
- **గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన కవిత**
- **ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్**
- **నవంబర్ చివరి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సూచన**
- **గడువులోగా పనులు చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక**

అఖండసూర్య, జయశంకర్ భూపాలపల్లి:

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంపు హౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించా రు. రాష్ట్రంలో నీటి సమస్యల నేపథ్యంలో చేపట్టిన పర్యటనలో భాగంగా పంపుహౌస్ వ్యూ పాయింట్ నుంచి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అప్పటిలోగా పనులు చేపట్టకపోతే కన్నెపల్లి పంపుహౌస్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ప్రాణహిత నీటిని మళ్లించాలి

రాష్ట్రంలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్ర భుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కవిత కోరారు. ప్రాణహిత నీటిని మళ్లించేలా కాఫర్ డ్యాం నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ పనులను నవంబర్ నెలాఖ రులోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గడువులోగా నిర్మాణం చేపట్టకపోతే కన్నెపల్లి పంపుహౌస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.

మేడిగడ్డను సాకుగా చూపొద్దు

మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని కవిత ప్రభుత్వానికి హితవు పలికారు. నీటి సమస్యలపై ప్రశ్నించడమే కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను కూడా సూచిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితోనే తాము క్షేత్రస్థాయికి వచ్చామని తెలిపారు.

రైతులకు మేలు చేయాలని డిమాండ్

టీఆర్ఎస్ పార్టీ కేవలం రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశంతో పనిచేయడం లేదని కవిత అన్నారు. ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ప్రయోజనం చేకూరాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను నీరియస్‌గా తీసుకుని, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాఫర్ డ్యాం నిర్మాణంపై ప్రభుత్వం స్పందించి, నిర్దే శించిన గడువులోగా పనులు ప్రారంభించాలని కవిత కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నీటి లభ్య తను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని సూచించారు.

ఆత్మకూరులో క్యాస్ట్ సర్టిఫికెట్ వివాదం

- **శిల్పా చక్రపాణి రెడ్డి ఆందోళన**
- **నంద్యాల జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**
- **వైసీపీ చైర్మన్ అభ్యర్థి కుల ధ్రువీకరణ పత్రం చించివేశారంటూ నిరసన**
- **అనుచరులతో కలిసి కార్యాలయం వద్దకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే**
- **వైసీపీ నేతలను సముదాయించేందుకు డీఎస్పీ ప్రయత్నం**
- **పోలీసుల హెచ్చరికలతోనూ కొనసాగిన వాగ్వాదం**
- **శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వెళ్లిపోవాలని పోలీసుల సూచన**
- **కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లిన శిల్పా**
- **సమస్యను పరిష్కరిస్తామని అధికారుల హామీ**
- **నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంపీ బైరెడ్డి శబరి నిరసన**
- **గొడవలకు వచ్చిన వైసీపీ నేతలను బయటకు పంపాలని ఎంపీ డిమాండ్**

అఖండసూర్య, నంద్యాల :

నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం



వద్ద రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ చైర్మన్ అభ్యర్థికి చెందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని చించివేశారనే ఆరోపణతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆందోళన కు దిగారు. తన అనుచరులతో కలిసి మున్సిపల్ కార్యాల యం వద్ద నిరసన వ్యక్తం చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కుల ధ్రువీకరణ పత్రంపై వివాదం

ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో వైసీపీ చైర్మన్ అభ్యర్థికి సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాన్ని చిం చివేశారంటూ శిల్పా చక్రపాణి రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఆయన తన అనుచరులతో కలిసి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

రంగంలోకి దిగిన పోలీసులు

పరిస్థితి తీవ్రతను గమనించిన డీఎస్పీ రామాంజి నాయక్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. వైసీపీ నాయకులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. 'మీవాళ్లు రండి.. నేను మాట్లాడిస్తాను' అంటూ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల సూచనలను పట్టించుకోకుండా వైసీపీ నేతలు ఆందోళన కొనసాగించినట్లు సమాచారం. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిం చారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

సమస్యను పరిష్కరిస్తామన్న అధికారులు

కుల ధ్రువీకరణ పత్రానికి సంబంధించిన వివాదాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై స్పందిం చిన అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నట్లు సమాచారం.

నంద్యాలలో ఎంపీ బైరెడ్డి శబరి నిరసన

మరోవైపు నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంపీ బైరెడ్డి శబరి ఆందోళనకు దిగారు. గొడవలు చేసేందుకు వచ్చిన వైసీపీ నాయకులను కార్యాలయం నుంచి బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయాల వద్ద చోటుచేసుకుంటున్న ఈ పరిణామా లు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

మైదుకూరు మున్సిపల్ ఎన్నిక వాయిదా

- **త్వరలో కొత్త నోటిఫికేషన్**
- **మైదుకూరు మున్సిపల్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటన**
- **జిల్లా కలెక్టర్ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్న ఎన్నికల కమిషన్**
- **నామినేషన్ పత్రాలు చించివేయడంతో పరిశీలన కష్టమని వెల్లడి**
- **త్వరలోనే ఎన్నికల నిర్వహణకు కొత్త నోటిఫికేషన్ జారీ**
- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టీకరణ**

అఖండసూర్య, అమరావతి :

వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. నామినేషన్ పత్రాలు చిం చివేసిన నేపథ్యంలో వాటి పరిశీలన కష్టమవుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ నుంచి అందిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మైదుకూరులో ఎన్నికల నిర్వహణకు త్వరలోనే కొత్త నో టిఫికేషన్ జారీ చేస్తామని స్పష్టం చేశారు.

కలెక్టర్ నివేదికతో నిర్ణయం

మైదుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ పత్రాలు చించివేసిన ఘటన నేపథ్యంలో ఎన్నికల నిర్వ హణపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. పత్రాలు అందుబాటులో లేకపోవడం, వాటి పరిశీలన కష్టమవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న ట్లు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. జిల్లా కలెక్టర్ సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత ఎన్నికను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మైదుకూ రులో ఎన్నికల నిర్వహణకు సంబంధించి త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. తదుపరి ఎన్నికల షెడ్యూల్, ఇతర వివరాలను నోటిఫికేషన్ ద్వారా ప్రకటించనున్నారు.

కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించేందుకు సోమవారం సాయంత్రం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించను న్నట్లు ఎస్ఈసీ తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

భారీగా నామినేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు భారీ సంఖ్యలో నా మినేషన్లు దాఖలైనట్లు అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్ పదవులకు 320 నా మినేషన్లు అందినట్లు చెప్పారు. కార్పొరేషన్ల వార్డు సభ్యుల స్థానాలకు 8,190 నామినేషన్లు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులకు 1,358 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ఆయా మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల స్థానాలకు 24,451 నా మినేషన్లు అందినట్లు పేర్కొన్నారు. మైదుకూరు ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో అక్కడి తదుపరి ఎన్నికల షె డ్యూల్‌పై ఆసక్తి నెలకొంది. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.



వంగవీటి రాధా విజయం ఖాయం: కేశినేని చిన్ని

- **విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధా**
- **కూటమి నేతలంతా ఒకే టీమ్‌గా పనిచేస్తున్నారని వెల్లడి**
- **తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవన్న రాధా**
- **రేపటి నుంచి వార్డుల వారీగా ప్రచారం**
- **100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యం**
- **రెబల్స్ సమస్య లేకుండా సమన్వయం**
- **కూటమి గెలుపునకు నేతల ఐక్య కార్యాచరణ**
- **భారీ మెజారిటీతో రాధా గెలుస్తారన్న కేశినేని చిన్ని**
- **కులమతాలకు అతీతమైన నాయకుడంటూ బుద్ధా వెంకన్న ప్రశంస**
- **ప్రతి కార్యకర్త రాధా గెలుపునకు కృషి చేయాలని పిలుపు**

అఖండసూర్య, విజయవాడ :

విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ విజయం సాధిస్తారని, సుమారు రెండు లక్షల మెజా రిటీతో గెలుస్తారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై తన కార్యాలయంలో కూటమి నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో వంగవీటి రాధాకృష్ణ, బుద్ధా వెంకన్న, పట్టాభి తదితరులు పా ల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కూటమి అభ్యర్థుల విజయానికి చేప ట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాను ప్రకటించడం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని కేశినేని చిన్ని పేర్కొన్నారు. రాధా భారీ మెజారిటీతో గెలవా లని ఆకాంక్షించారు. రేపటి నుంచి వార్డుల వారీగా పర్యటించి కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. అన్ని స్థానాల్లోనూ విజయం సాధించేలా కృషి చేస్తామని, 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కూటమిలో రెబల్స్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని కేశినేని చిన్ని చెప్పారు. టికెట్లు ఆశించి దక్కని నేతలతో మాట్లాడి సమన్వయం చేసుకుంటామని తెలిపారు. అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని, కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భం గా వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. కూటమి నేతలంతా ఒకే టీమ్‌గా పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. తమ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజలు కూటమికి సంపూర్ణ మద్దతు ఇస్తా రనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నేత బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.. కులమ తాలకు అతీతంగా ప్రజల నాడి తెలిసిన నాయకుడు వంగవీటి రాధా అని ప్రశంసించారు.

మండలంలోని గ్రామాలలో బెల్ట్ షాపులను మూసివేయాలి

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్

మద్దూరు,అఖండ సూర్య



మండలంలోని గ్రామాలలో పిచ్చలవిడిగా నడుస్తున్నటువంటి మద్యం బెల్ట్ షాప్ ల వలన గ్రామాలలో మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని, గురి అవుతున్నారని గ్రామాలలో ఉన్న బెల్టు షాపులను తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు బిఆర్ఎస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ తెలిపారు. మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో విచ్చలవిడిగా నడుస్తున్నటువంటి బెల్టు షాపుల వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతూ, ఉదయం నుండి రాత్రి వరకు మద్యం సేవించి గ్రామంలో గొడవలకు దిగుతున్నారని, శాంతి భద్రతలకు విగాదం కలిగిస్తున్నారని, కుటుంబంలోని భార్య పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తూ ఆర్థికంగా కృంగిపోతూ అప్పుల పాలు అవుతున్నారని గ్రామంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలంటే గ్రామంలో ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని మద్దూరు మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మేక సంతోష్ తెలిపారు.

సిద్దిపేట ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, అఖండ సూర్య:



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం సిద్దిపేట జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సిరిసంపదలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని సిద్దిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తుందని, కుటుంబాల మధ్య ప్రేమానురాగాలను పెంపొందిస్తూ ఐక్యత, సోదరభావాన్ని చాటుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో, ఆత్మీయులతో ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందం.. ప్రతి కుటుంబంలో వెలుగు.. ప్రతి రైతు ముఖంలో చిరునవ్వు.. ప్రతి పేద కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలి* అని ఆకాంక్షిస్తూ, సిద్దిపేట జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, శాంతిసౌభాగ్యాలతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. దసరా పండుగ అందరి జీవితాల్లో విజయాలను, సరికొత్త అవకాశాలను తీసుకురావాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ అరవింద్ నిధులతో హైమాస్ లైట్లు ప్రారంభం

రాయికల్, అఖండ సూర్య :



మండలంలోని రాజనగర్ తండాలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అయినటువంటి ఎంపీ అరవింద్ గారి ఎంపీ నిధులతో మంజూరైన ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. గ్రామ అభివృద్ధికి తమ నిధులు కేటాయించిన సందర్భంగా ఎంపీ గారికి రాజనగర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధినిధులను ప్రజా అవసరాలకు వినియోగిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని గ్రామస్థాయి బిజెపి పార్టీ నాయకులు అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో బిజెపి ఎల్లప్పుడు ముందుంటుందని గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుంది అని బిజెపి ఎస్టి మోర్చా జగిత్యాల జిల్లా మీడియా కన్వీనర్ అయినటువంటి జలపతి నాయక్ గుగ్లవత్ గారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీను నాయక్ నాగావత్ చందు నాయక్ సభావాత్ గంగారం గుగ్లవత్ శీల గ్రామ నాయకులు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో 5వ వార్డులోని కార్మికులకు దసరా కానుకగా దుస్తుల పంపిణీ చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి

సిద్దిపేట అఖండ సూర్య

నేరెళ్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యం లో కార్యక్రమం.. పండుగ వేళ కార్మిక కుటుంబాల్లో ఆనందం పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని, ఆ ఆనందం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందాలని ఆకాంక్షిస్తూ సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీ 5వ వార్డులో కార్మికులకు దసరా పండుగ సందర్భంగా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరెళ్ల ఉదయ్ కుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.



వైద్య విద్యార్థికి పోపా ఆర్థిక చేయూత...

- పేద పద్మశాలి విద్యార్థులకు అండగా నిలుస్తాం: జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాజేష్

జగిత్యాల అర్బన్, అఖండ సూర్య:



వైద్య విద్యను అభ్యసించేందుకు వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన భోగ విష్ణువర్ధన్‌కు పద్మశాలి ఆర్గనైజేషన్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూ.36 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేద పద్మశాలి విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ సహాయాన్ని అందించినట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా పోపా జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాజేష్ మాట్లాడుతూ పద్మశాలీలు విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పోపా అండగా నిలుస్తోందని తెలిపారు. పేద పద్మశాలి కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి ఉన్నత విద్యకు అవసర మైన సహాయ సహకారాలు అందించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు.వైద్య విద్యలో ప్రవేశం పొందిన భోగ విష్ణువర్ధన్‌ను అభినందిస్తూ, అతని చదువు విజయవంతంగా పూర్తయ్యేందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఐదేళ్ల పాటు అధ్యయన సామగ్రి అందజేత

భోగ విష్ణువర్ధన్‌కు ఐదేళ్ల పాటు అవసరమైన అధ్యయన సామగ్రిని అందజేస్తామని ప్రముఖ వైద్యులు, సన్‌షైన్ ఆసుపత్రి అధినేత తాటి పాముల సురేష్ ప్రకటించారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థికి నిరంతర సహకారం అందించడం ద్వారా అతని విద్యాభ్యాసానికి తోడ్పడనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి, భవిష్యత్తులో సమాజానికి సేవలందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దండ గోవర్ధన్, ఏవీఎన్ రాజు,ఆడహక్ కమిటీ సభ్యులు వీర బత్తిని అనిల్, ఎలగందుల రవి, వాసం భీమయ్య, వడ్డేపల్లి శ్రీను, పోపా సభ్యులు మచ్చ శంకర్, నాగభూషణం, మ్యానపురి రాజ కిషన్, ఎలిగేటి రాజేంద్రప్రసాద్, కస్తూరి రాంబాబు, మ్యాన మహేష్, ఆకుబత్తిని శ్రీను, గంగాధర్ (జీఆర్), తాటిపాముల వినోద్, చెట్ పల్లి సుధాకర్, జోగ రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మండల యూత్ కమిటీ ఎన్నిక

మద్దూరు,అఖండ సూర్య

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మద్దూరు మండల యూత్ కమిటీని సోమవారం జిల్లా అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పిడిశెట్టి గౌరీష, ప్రధాన కార్యదర్శిగా తుమ్మలపల్లి శ్రీనాధులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న నాలుగవ మహాసభలు విజయవంతం చేయడంతో పాటు రజకుల ఐక్యతను మరింత బలవపత్రం చేయాలని లక్ష్యంతో మండల కమిటీల ఏర్పాటు కార్యక్రమాన్నివేగవంతం చేయడం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు జంగాపల్లి ఐలయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు లు అన్నారు.



ప్రతి ఇంటా సంతోషాల వెలుగులు నిండాలి: ఎంపీ రఘునందన్ రావు

- రైతుల జీవితాల్లో సిరులు.. ప్రజల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలి విజయదశమి శుభాకాంక్షలు

సిద్దిపేట, అఖండ సూర్య:



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా ప్రజలకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పేరుపేరునా హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

దసరా పండుగ ధర్మానికి, న్యాయానికి, మంచికి ప్రతీక అని పేర్కొంటూ.. ఈ పర్వదినం ప్రజలందరిలో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ప్రజలందరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు ఇంట పంటల సిరులు కురవాలి.. ప్రతి పేద కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలి.. ప్రతి యువతకు ఉజ్వల భవిష్యత్తు కలగాలి.. ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, శాంతిసౌభాగ్యాలు నిండాలి అని ఎంపీ రఘునందన్ రావు ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకుంటూ, ప్రజలందరికీ మరోసారి పేరుపేరునా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

12వ వార్డు మత్సవాయిని కుంటలో దేవీ నవరాత్రి ఉత్సవాలు

- పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

సిద్దిపేట అఖండ సూర్య

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 12వ వార్డులోని మత్సవాయిని కుంట లో ఏర్పాటు చేసిన శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాల్లో మాజీ మంత్రి, శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. దుర్గాభవాని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు డి. హనుమంతరావు, రాజగిరి ప్రశాంత్, లంబ స్వామి యాదవ్, వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు పుల్లగూర్ల రజిత జనార్దన్ రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు

సిద్దిపేట, అఖండ సూర్య:

సిద్దిపేట జిల్లా ఫార్మర్ అడ్వైజర్ కమిటీ సభ్యురాలు పుల్లగూర్ల రజిత జనార్దన్ రెడ్డి జిల్లా ప్రజలకు విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగ ప్రజలందరికీ నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని అందించాలని పేర్కొన్నారు. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

కుమ్మరిపెల్లి లో ఘనంగా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి సప్తతి తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర

రాయికల్, అఖండ సూర్య :

మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద శ్రీ దుర్గానవరాత్రి ఉత్సవాలలో తొమ్మిదవ రోజు సోమవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి సప్తతి తిరునక్షత్ర శ్రీరామ హృదయ కలశ యాత్ర వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్, వేద పండితులు మరింగంటి రామగోపాలచార్యులు, రాజోజి సాయిరాంచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని, లోక కళ్యాణం జరుగాలనీ, దేశద్రోహులు, విదేశీ విద్రోహుల నుండి ధర్మం ధర్మపాలకులు రక్షించబడాలని, శ్రీరామ తత్వం, నామము అందరికి చేర్చడం, తద్వారా దేశానికి ధర్మానికి శ్రీరామ రక్ష కై కొనసాగుతున్న శ్రీరామ హృదయ కలశ యాత్ర కుమ్మరిపెల్లి రావడం అదృష్టమని అన్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి, కలశంలో శ్రీరామ అని పిస్తూ అక్షింతలు వేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కొడిమ్యాల శేఖర్, రవి, శేఖర్, హరీష్, మనోజ్, సాయి, అజయ్, బాలు, నరేష్, శ్రీధర్, సుమ, లావణ్య, తేజ, సుష్మ, జ్యోతి, రజిత, సుజాత, లక్ష్మి, లత భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్

జగిత్యాల అర్బన్, అఖండ సూర్య



భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వ జన సురక్షా భీమా పథకాలైన "ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన" మరియు "ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన " కోసం జిల్లా పరిధిలో ఉన్న అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ అన్నారు. సహజ మరణం మరియు ప్రమాద వశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబ సభ్యులైన నామినీ కి కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక భరోసా ఇస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల బ్రాంచీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఖచ్చితంగా శిబిరాలు నిర్వహించి ఎక్కువ మొత్తంలో నమోదు చేయాలని, రీ కేవైసీ పెండింగ్ కూడా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని బ్యాంకుల ఉన్న తాధికారులతో మాట్లాడి తదనుగుణంగా కార్యచరణ రూపొందించామని అమలు పరచడానికై తగు ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ తెలిపారు.



మల్లన్నపేటలో ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ కోలల పంపిణీ!

గొల్లపల్లి, అఖండ సూర్య:

తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో యూత్ నాయకుడు అవారి చందు ఆధ్వర్యంలో మహిళలకు కోలల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామంలోని ఆడపడుచులందరికీ సరిపడా కోలలను పంపిణీ చేసి పండుగ వేడుకల్లో భాగస్వాములయ్యారు. గ్రామంలోని మహిళలందరూ బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని, సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను సామూహికంగా జరుపుకోవడం ద్వారా గ్రామంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడతాయని అన్నారు. పండుగల సందర్భంగా మహిళలకు అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధెంకి లక్ష్మీ మల్లారెడ్డి, వార్డు సభ్యులు, యూత్ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో నూతన అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన

నిర్మల్ అఖండ సూర్య



ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ కొమురం భీం చౌరస్తా వద్ద నిర్మించనున్న నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ఈ నెల 21న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్ రెడ్డి తెలిపారు.
బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొననున్నారు.నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణంతో ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని జిల్లా అగ్నిమాపక అధికారి కోరారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **జన సేన నాయకుడు ఆర్కే సాగర్**

రామగుండం అఖండ సూర్య:

గోదావరిఖని: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, సినీ హీరో ఆర్కే సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. గోదావరిఖని సింగరేణి 11 ఇంక్లైన్ మైన్‌లో నిర్వహించిన దుర్గామాత చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కార్మికులు చేస్తున్న కృషిని అభినందిస్తూ, వారికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రావుల మధు, డాక్టర్ రాజ్‌కుమార్, తన్నీరు మధుకర్, జీవన్, విష్ణు, రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమార్, రంజిత్, అశ్విత్, బషీరుద్దీన్, తిరుపతి, లోకేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.







దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా
పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

- **జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**

ములుగు, అఖండ సూర్య:

విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం సేవలందించే పోలీసు సిబ్బంది క్షేమంగా ఉండాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. పండుగల సమయంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పి గారు జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఏఎస్ పి ఏటూరునాగారం మనన్ భట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ డీసీఆర్‌బీ కిషోర్ కుమార్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ఐ అడ్మిన్ స్వామి, ఆర్ఐ ఆపరేషన్స్ తిరుపతి, ఆర్ఐ ఎంటీవో వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ అండ్ వెల్ఫేర్ శ్రీకాంత్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు, వెంకటాపురం ఎస్ఐ చల్లా రాజు, ఎస్ ఐ తాజుద్దీన్, ఎస్ఐ కృష్ణ ప్రసాద్, ఇతర ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





నవంబర్ 1న టీయూసీఐ పెద్దపల్లి జిల్లా సదస్సు

- **కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి: గొల్లపల్లి చంద్రయ్య**

అంతర్గాం అఖండ సూర్య:

నవంబర్ 1న గోదావరిఖని ప్రెస్ భవన్‌లో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) పెద్దపల్లి జిల్లా సదస్సును కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా నాయకుడు గొల్ల పల్లి చంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.
ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక చట్టాలు కార్మికుల హక్కులపై ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. పని భారం పెరుగుతున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, జీవోల ప్రకారం వేతనాలు అందకపోవడం వల్ల కార్మికులు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో పాటు బసంత్‌నగర్ ప్రాంతంలోని భవన నిర్మాణ కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు.
కార్మికుల సమస్యలపై చర్చించి, హక్కుల సాధనకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా సదస్సు దోహదపడుతుందని తెలిపారు. ఈ సదస్సుకు టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులతో పాటు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు భూసనవేణి కృష్ణ, టీయూసీఐ జిల్లా నాయకులు ఆడెపు శంకర్, గుమ్మడి వెంకన్న, గంగాదరి తిరుపతి, రమేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.



విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్**

ములుగు, అఖండ సూర్య:

విజయానికి, ధర్మానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి దసరా పండుగను పురస్కరించుకొని ములుగు జిల్లా ప్రజలకు, రాజేశ్వరరావుపల్లి గ్రామ ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు, నిరుపేదల జీవితాల్లో కొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు. సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, పరస్పర గౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు, అభివృద్ధి, ఆనందం వెల్లివిరియాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. ప్రజలందరికీ విజయదశమి తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్ ములుగు జిల్లా అధ్యక్షులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ శుభాకాంక్షలు తెలిపారు.



అంతర్గాం, పెద్దంపేటలో బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు!

- **అంతర్గాంలో తొలగింపు.. పెద్దంపేటలో ఫ్లెక్సీ మాయం!**

అంతర్గాం అఖండ సూర్య:

టీటీఎస్ అంతర్గాం, పెద్దంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రెడ్డికి సంబంధించిన ఫ్లెక్సీల తొలగింపు చర్చాంశనీయం అయ్యింది. అంతర్గాం గ్రామంలో ఫ్లెక్సీని తొలగించగా, పెద్దంపేటలో ఫ్లెక్సీ కనిపించకుండా పోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీటీఎస్ అంతర్గాం కార్యదర్శిని వివరణ కోరగా, ఫ్లెక్సీ తొలగింపు గురించి తనకు తెలియదని వివరణ ఇచ్చారు. పెద్దంపేట కార్యదర్శికి ఫోన్ కాల్ ద్వారా సంప్రదించగా, కార్యదర్శి అందుబాటులోకి రాలేదు.

రాజకీయ కోణం లేదు

అంతర్గాం సర్పంచ్ ఆంగోతు రవి నాయక్

అంతర్గాం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించి మరోచోట ఏర్పాటు చేసుకోవాలని సూచించాను. నేను గ్రామ సర్పంచ్‌గానే కాకుండా ఆలయ కమిటీ చైర్మన్‌గా కూడా ఉన్నాను. పార్టీల భావనతో కాకుండా ఫ్లెక్సీగానే భావించాను. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకనే: బీఆర్ఎస్ నాయకుడు కొలిపాక మధుకర్ రెడ్డి

ఫ్లెక్సీల తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నాము. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ఓర్వలేని వారే గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగించారు.



ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట షురూ.. షూటింగ్‌లో స్వర్ణం, రజతం

- ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు శుభారంభం
- మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో మోనాకు స్వర్ణం
- అవనీ లేఖరాకు రజత పతకం
- గేమ్స్ రికార్డు స్కోర్‌తో స్వర్ణం సాధించిన మోనా అగర్వాల్
- పోటీల తొలిరోజే పతకాల ఖాతా తెరిచిన భారత్

అఖండ సూర్య :

జపాన్‌లోని ఐచినగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. పోటీల తొలిరోజైన సోమవారం, భారత పారా షూటర్లు పతకాల వేట ప్రారంభించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత క్రీడాకారిణులు మోనా అగర్వాల్ స్వర్ణం, అవనీ లేఖరా రజతం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ గేమ్స్‌లో భారత్‌కు ఇవే తొలి పతకాలు కావడం విశేషం.

హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా గేమ్స్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల స్వల్ప తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ అవనీ లేఖరా వెనుకబడింది. అవనీ 249.6 పాయింట్లతో రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి 227.9 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకుంది.

అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో కూడా భారత షూటర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా అగర్వాల్ 629.1 పాయింట్లతో గేమ్స్ రికార్డు నెలకొల్పి అగ్ర స్థానంలో నిలవగా, అవనీ లేఖరా 626.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజే రెండు పతకాలతో భారత్ ఈ మెగా ఈవెంట్‌లో తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది.



102 ఏళ్లలో ఇదే తొలిసారి... దక్షిణాఫ్రికా జట్టులో అరుదైన రికార్డు!

- దక్షిణాఫ్రికా జట్టులో 8 మంది 30 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు
- ఆస్ట్రేలియా తుది జట్టులోని 11 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడినవారే
- గెబెర్హా టెస్టులో వర్షం కారణంగా తొలిరోజు ఆట పాక్షికమే
- రెండు జట్లలో కలిపి మొత్తం 19 మంది 30 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు
- తొలి టెస్టు ఓటమితో జట్టులో మార్పులు చేయడమే కారణం

అఖండ సూర్య :

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఓ అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు 102 ఏళ్ల తర్వాత ఒక చారిత్రక రికార్డును పునరావృతం చేసింది. ఆస్ట్రేలియాతో గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తుది జట్టులో ఏకంగా 8 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే ఉండటం విశేషం. ఇంతకుముందు 1924లో ప్రొటీస్ జట్టులో ఇలాంటి కూర్పు కనిపించింది. శతాబ్ద కాలం తర్వాత మళ్లీ అదే సీన్ రిపీట్ కావడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఆదివారం ప్రారంభమైన ఈ టెస్టు మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి రోజు కేవలం 12.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. డర్బన్‌లో జరిగిన తొలి టెస్టులో 214 పరుగుల తేడాతో ఓటమిపాలైన దక్షిణాఫ్రికా... రెండో టెస్టు కోసం జట్టులో మూడు మార్పులు చేసింది. 30 ఏళ్ల మార్క్వెస్ అకర్‌మన్‌కు అరంగేట్రం అవకాశం ఇవ్వగా, కగిసో రబడ, మాథ్యూ బ్రీట్జ్కేలను తిరిగి జట్టులోకి తీసుకుంది. ఈ మార్పుల వల్లే తుది జట్టులో 30 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 8కి చేరింది. దక్షిణాఫ్రికా జట్టులో స్పిన్నర్ సైమన్ హార్మర్ (37) అత్యంత పెద్ద వయస్కుడు కాగా, ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ (26) అత్యంత పిన్న వయస్కుడు. మరోవైపు, ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టులో అయితే తుది జట్టులోని 11 మంది ఆటగాళ్లు 30 ఏళ్లు పైబడిన వారే కావడం మరో విశేషం. అనుభవానికే పెద్దపీట వేస్తూ ఆసీస్ బరిలోకి దిగింది. ఆ జట్టులో మాట్ రెన్‌షా (30) అత్యంత చిన్నవాడు కాగా, స్టీవ్ స్మిత్, స్కాట్ బోలాండ్ (37) సీనియర్ ఆటగాళ్లుగా ఉన్నారు.

మొత్తం మీద ఈ టెస్టులో ఇరు జట్లలో కలిపి 19 మంది ఆటగాళ్లు 30 ఏళ్లకు పైబడిన వారే బరిలోకి దిగారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో ఇంతమంది సీనియర్ ఆటగాళ్లు ఆడటం ఇది రెండోసారి మాత్రమే. 1926లో ఇంగ్లండ్‌ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లో 20 మంది 30 ఏళ్లు పైబడిన ఆటగాళ్లు ఆడారు. ఇక ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్ల నష్టానికి 20 పరుగులు చేసింది. రెండు వికెట్లనూ స్కాట్ బోలాండ్ పడగొట్టాడు.



టీ20ల్లో షఫాలీ సరికొత్త చరిత్ర.. కెప్టెన్ రికార్డునే బ్రేక్ చేసిన ఓపెనర్

- ప్రపంచ రికార్డు సృష్టించిన భారత ఓపెనర్ షఫాలీ వర్మ
- ఒకే క్యాలెండర్ ఇయర్‌లో 50కిపైగా అత్యధిక స్కోర్లు
- జింబాబ్వేతో రెండో టీ20లో 9 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం
- 2-0తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా
- కెప్టెన్‌గా స్మృతి మంధానకు ఇదే తొలి సిరీస్ విజయం



అఖండ సూర్య :

భారత మహిళల క్రికెట్ జట్టు యువ ఓపెనర్ షఫాలీ వర్మ సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో మెరుపు ఇన్నింగ్స్‌తో అదరగొట్టి, టీమిండియాకు ఘన విజయాన్ని అందించింది. ఈ విజయంతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 20 తేడాతో కైవసం చేసుకుంది.

రాయ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో షఫాలీ కేవలం 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్ల సాయంతో 55 పరుగులు చేసింది. ఈ క్రమంలో మహిళల టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక 50కిపైగా స్కోర్లు చేసిన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. 2026లో షఫాలీకి ఇది 9వ యాభైకి పైగా స్కోరు (ఒక సెంచరీ, ఎనిమిది హాఫ్ సెంచరీలు). ఇంతకుముందు ఈ రికార్డు భారత కెప్టెన్ స్మృతి మంధాన పేరిట ఉండేది. మంధాన 2024లో ఎనిమిది 50కిపైగా స్కోర్లు సాధించింది. తాజాగా తన కెప్టెన్ రికార్డునే షఫాలీ అధిగమించడం విశేషం. ఈ ఏడాది ఇప్పటివరకు 26 టీ20 మ్యాచ్‌లలో షఫాలీ మొత్తం 922 పరుగులు చేసింది.

103 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో స్మృతి మంధానతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన షఫాలీ, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఈ జోడీ తొలి వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయాన్ని ఖాయం చేసింది. షఫాలీ 24 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని జెటవగా, మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.అంతకుముందు బ్యాటింగ్ చేసిన జింబాబ్వే, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే బ్యాటర్లు తడబడ్డారు. నికీ ప్రసాద్ 7 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టగా, మిగతా బౌలర్లు కూడా రాణించారు. జింబాబ్వే జట్టులో చిపో ముగేరితిరిపానో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ సిరీస్ విజయంతో, భారత మహిళల జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్మృతి మంధాన తన తొలి సిరీస్‌ను గెలుచుకున్నట్లయింది.

బీసీసీఐ కీలక నిర్ణయం.. పురుషుల జట్టు చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా

- సెలక్షన్ కమిటీలో కొత్త సభ్యుడిగా రమేశ్ పొవార్
- సీఏసీ ఏకగ్రీవంగా పొవార్ పేరు సిఫారసు
- ఐదుగురు సభ్యులతో సెలక్షన్ కమిటీ ఏర్పాటు
- పొవార్ భారత్ తరపున రెండు టెస్టులు, 31 వన్డేలు
- భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన పొవార్



అఖండ సూర్య :

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల జట్టు సెలక్షన్ కమిటీలో కీలక మార్పులు చేసింది. చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజాను నియమించగా, మాజీ క్రికెటర్ రమేశ్ పొవార్‌కు కమిటీలో చోటు కల్పించింది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి తప్పుకొన్న నేపథ్యంలో సెలక్షన్ కమిటీ కొత్త కూర్పును బీసీసీఐ ప్రకటించింది.

బీసీసీఐ సోమవారం విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం.. క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) రమేశ్ పొవార్ నియామకాన్ని ఏకగ్రీవంగా సిఫారసు చేసింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపేలతో కూడిన సీఏసీ.. దరఖాస్తులను పరిశీలించి, బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది.

టెస్టు మ్యాచ్‌ల్లో ఆడిన మ్యాచ్‌ల సంఖ్య ఆధారంగా సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి అధ్యక్షత వహించనున్నాడు. ఐదుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో శివ్ సుందర్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రాతో పాటు రమేశ్ పొవార్ సభ్యులుగా కొనసాగనున్నారు.

రమేశ్ పొవార్ భారత జట్టు తరపున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడాడు. ఆటగాడిగా కెరీర్ ముగిసిన తర్వాత కోచ్‌గా సేవలందించాడు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పని చేయడంతో పాటు ముంబై, గుజరాత్ జట్లకు కోచింగ్ బాధ్యతలు నిర్వహించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గానూ పనిచేశాడు. పొవార్ కోచ్‌గా ఉన్న సమయంలో భారత మహిళల జట్టు ఆసియా కప్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించింది.

మరోవైపు, చీఫ్ సెలెక్టర్‌గా పనిచేసిన అజిత్ అగార్కర్ సేవలను బీసీసీఐ ప్రశంసించింది. 2023 జులైలో బాధ్యతలు చేపట్టిన అగార్కర్ పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు గెలిచిందని తెలిపింది. ఆసియా క్రీడల్లో వరుసగా రెండు స్వర్ణ పతకాలు సాధించిన విజయాల్లోనూ ఆయన పదవీకాలం కీలకంగా నిలిచింది.

పురుషుల జట్టు సెలక్షన్ కమిటీ సభ్యులు:
ప్రజ్ఞాన్ ఓజా చైర్‌పర్సన్
శివ్ సుందర్ దాస్ సభ్యుడు
ఆర్పీ సింగ్ సభ్యుడు
అజయ్ రాత్రా సభ్యుడు
రమేశ్ పొవార్ సభ్యుడు

రింకూ సింగ్ మళ్లీ మెరిశాడు.. రంజీల్లో వరుసగా రెండో సెంచరీ.. సెలక్టర్లకు గట్టి సమాధానం

- రంజీ ట్రోఫీలో అదరగొడుతున్న రింకూ సింగ్
- గోవాపై అజేయ సెంచరీతో ఒంటరి పోరాటం
- ఈ సీజన్‌లో ఇది అతనికి వరుసగా రెండో శతకం
- జాతీయ జట్టులో చోటు దక్కకపోవడంపై ఫ్యాన్స్ ఆగ్రహం
- కష్టాల్లో ఉన్న ఉత్తరప్రదేశ్ జట్టును ఆదుకున్న రింకూ



అఖండ సూర్య :

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ సంచలనం రింకూ సింగ్, తన ప్రదర్శనతో బీసీసీఐ సెలక్టర్ల తలుపును గట్టిగా తడుతున్నాడు. జాతీయ జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీ 202627 సీజన్‌లో వరుసగా రెండో సెంచరీ బాది, తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గోవాతో జరుగుతున్న మ్యాచ్‌లో ఒంటరి పోరాటం చేసి అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు.

నిన్న కాన్పూర్‌లో గోవాతో ప్రారంభమైన రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌ఏ మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరప్రదేశ్, కేవలం 33 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు అభిషేక్ గోస్వామి (5), ఆర్యన్ జుయల్ (14), కెప్టెన్ కరణ్ శర్మ (0) ఘోరంగా విఫలమయ్యారు. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించాడు.

ఒకవైపు వికెట్లు పడుతున్నా, మరోవైపు పట్టుదలగా నిలబడి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. తన సహజ శైలికి భిన్నంగా ఓపికగా ఆడి, జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. తన అజేయ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 118 పరుగులు సాధించాడు. అతని పోరాటంతో ఉత్తరప్రదేశ్ జట్టు 71 ఓవర్లలో 202 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. ఈ సీజన్‌లో బిహార్‌పై కూడా రింకూ (112) శతకం సాధించడం గమనార్హం.


ఇటీవలే జింబాబ్వే సిరీస్ తర్వాత రింకూను జాతీయ జట్టు నుంచి తప్పించారు. ఆపై న్యూజిలాండ్ పర్యటనకు కూడా ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో, అతను దేశవాళీ టోర్నీలో వరుస సెంచరీలతో చెలరేగడంతో, సోషల్ మీడియాలో అభిమానులు సెలక్టర్ల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇంత నిలకడగా ఆడుతున్న ఆటగాడిని ఎందుకు విస్మరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే.. గోవా బౌలర్ల లో లెగ్ స్పిన్నర్ యశ్ కస్వంకర్ 86 పరుగులిచ్చి 5 వికెట్లతో ఉత్తరప్రదేశ్ పతనాన్ని శాసించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన గోవా, తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో శివేంద్ర భుజ్‌బల్ (31 నాటౌట్), సుయాష్ ప్రభుదేశాయ్ (12 నాటౌట్) ఉన్నారు.



లేటుగా నిద్రపోతున్నారా? అయితే మీ పనైపోయినట్లే...

మనిషి బ్రతకాలంటే ఆహారం ఎంత అవసరమో.. కంటి నిండా నిద్ర కూడా అంతే ముఖ్యం. నిద్ర లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. మీ వయస్సుకు తగ్గట్టు మీరు ఎన్ని గంటలు నిద్రపోవాలో మీకు తెలుసా? మీ వయస్సు బట్టి మీరు రోజుకు ఎన్నిగంటలకు నిద్రపోవాలి.. ఎన్నిగంటలకు నిద్ర లేవాలి.. ఏ వయస్సు వాళ్లు ఎన్ని గంటలు నిద్రపోవాలని చాలా మందికి తెలియదు. అలాంటి వారి కోసం ఈ సూచనలు ఎంతగానో ఉపయోగపడతాయి. నిరంతరం పనిచేసే మన శరీరానికి అవసరమైన విశ్రాంతిని ఇచ్చే ప్రక్రియ నిద్ర. మనం నిద్రపోయే ఈ సమయంలో మన శరీరంలోని వివిధ అవయవాలు తమ శక్తిని పునర్నిర్మించుకుంటాయి. అందుకే నిద్ర మన ఆరోగ్య సంరక్షణలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. రాత్రిపూట సమయానికి నిద్రపోకుండా ఫోన్‌లో చూస్తూ మేలుకోవడం ఇప్పుడు చాలామందికి బాగా అలవాటైపోయింది. అయితే క్రమంగా ఈ అలవాటు మీకు పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

నిద్ర లేకపోతే అనారోగ్య సమస్యలు...



తగినంత నిద్ర లేకపోతే టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేకాదు నిద్రలేమి సమస్యతో బాధపడే వారికి ఊబకాయం కూడా వస్తుంది. ఎక్కువసేపు నిద్రపోకుండా ఫోన్ చూస్తూ గడిపేవారు క్రమంగా డిప్రెషన్‌లోకి వెళ్తారని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న బిజీ షెడ్యూల్స్ నేపథ్యంలో అర్ధరాత్రి వరకు మేలుకోవడం ఉదయం ఆలస్యంగా నిద్ర లేవడం ట్రెండ్‌గా మారుతోంది. అయితే దీనివల్ల మీకు తెలియకుండా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నిద్రలేమి వల్ల అలసట, చికాకు, మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపించడం సర్వసాధారణం. ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు తగినంత నిద్ర అవసరం. నిద్రలేమి కారణంగా పిల్లలలో పెరుగుదలకు ఆటంకం కలుగుతుంది.

మీరు ఎంత సేపు నిద్రపోవాలంటే...

వయస్సును బట్టి నిద్రపోయే విధానం ఉంటుంది. పసిపిల్లలు ఎక్కువ సేపు నిద్రపోతారు. అయితే క్రమంగా పెరిగే కొద్దీ నిద్రను పొందే సామర్థ్యం వయసుతో పాటు తగ్గుతూ వస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డ రోజుకు 11 నుంచి 14 గంటల వరకు నిద్రపోవడం అవసరం. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు ఉన్న పిల్లలు కనీసం 10 గంటలు పడుకోవాలి. స్కూల్ కి వెళ్లే పిల్లలు రోజుకి కనీసం 8 గంటలు కచ్చితంగా పడుకోవాలి. ఇక 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు రోజు 7 నుంచి 9 గంటల పాటు నిద్రించేలా చూసుకోవాలి. 60 సంవత్సరాలు పైబడిన వారు కనీసం 6 గంటలైనా రోజుకు నిద్రపోవాలి. ప్రతిరోజు 9 నుంచి 10 మధ్యలో నిద్రపోవడం తెల్లవారుజామున నిద్రలేయడం మీ దినచర్యలో భాగంగా చేసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.



ఇత్తడి పాత్రల్లో వంట చేస్తే.. ఆరోగ్యానికి నో డౌటా!



ప్రస్తుతం చాలా మంది ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. వారిలో ఉన్న చెడు అలవాట్లను మానుకొని, మంచి అలవాట్లు చేసుకుంటున్నారు. తాజాగా చాలా మంది వంట ఎలాంటి పాత్రల్లో చేస్తే బాగుంటుందనే విషయాన్ని తెలుసుకుంటున్నారు. పూర్వకాలంలో కట్టెల పొయ్యిల మీద మట్టికుండల్లో వండిన ఆహారం తిని ఎక్కువ రోజులు ఆరోగ్యంగా జీవించే వారు. కానీ, ఇప్పుడు ప్లాస్టిక్, స్టిల్ మన వంటగది ఆక్రమించేశాయి. స్టీల్, ప్లాస్టిక్ చూడటానికి అందంగా.. కిచెన్ తళతళ మెరిసేలాచేస్తాయి. కానీ, వాటిలోని రసాయనాలు అనారోగ్యానికి గురి చేస్తాయన్న అవగాహన చాలా మందిలో పెరిగిపోయింది. అందుకే, ఇప్పుడు ప్రత్యామ్నాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొన్నిలోహాలతో తయారు చేసిన పాత్రల్లో వండిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేల చేస్తుందని నిపుణులు కూడా చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఇత్తడి ఒక్కటంట. ఇత్తడి పాత్రలపై సూక్ష్మజీవులు ఎక్కువ సేపు జీవించలేవట. అంతేకాదు ఆహార పదార్థాలు త్వరగా వేడి తగ్గకుండా ఉంటాయంట. ఈ పాత్రల్లో చాట్ పెట్టుకుని తాగడం వల్ల ఆహార పదార్థాలు వండుకుని తినడం వల్ల ఎన్నో పోషకాలు లభిస్తాయని పేర్కొంటు న్నారు. వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయో మీకోసం.

రుచి పెరుగుతుంది...

వంట చేసేందుకు ఇత్తడి పాత్రలను వాడటం వల్ల వాటి రుచి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వీటిలో వంట చేసేటప్పుడు ఆపాత్రల నుంచి సహజ నూనెలు విడుదలవుతాయి. ఇవి సహజంగా ఆహారం రుచిని పెంచడమే కాదు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

రోగనిరోధకశక్తి పెరుగుతుంది...

ఇత్తడిపాత్రల్లో వాటర్ నింపి పెట్టుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రంతా ఇత్తడి పాత్రలో ఉంచిన నీటి తాగితే శరీరంలో రోగనిరోధకశక్తి పెరుగుతుందని చెబుతున్నారు. ఈ పాత్రలలో ఆహారాలను వండుకుని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని చెబుతున్నారు.

జీర్ణక్రియకు మేలు జరుగుతుంది..

చాయ్ తోపాటు ఇతర వంటకాలు ఇత్తడి గిన్నెల్లో చేయడం వల్ల జీర్ణ ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ లు చెబుతున్నారు. ఇందుకంటే ఇత్తడి పాత్రల్లో వంటచేసేటప్పుడు వాటి నుంచి విడుదలైన పోషకాలు మనం తినే ఆహారంతోపాటు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తాయని అంటున్నారు. ఆహారం బాగా జీర్ణమై మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తాయని వారు చెబుతున్నారు.

చర్మ ఆరోగ్యానికి...

ఇక ఇత్తడి చర్మానికి మేలు చేస్తుంది. రోజు చాయ్ తాగే అలవాటు ఉన్నవాళ్లు ఈ పాత్రలను వాడటం వల్ల ఇతర వంటకాల కోసం ఇత్తడి పాత్రలను వాడితే చర్మానికి కూడా మేలు చేస్తుంది. చర్మ సమస్యలు, మొటిమల నుంచి ఉపశమనం లభిస్తుంది.



ఈ వంటకాలు వండకూడదు...

మీరు ఇత్తడి పాత్రల్లో వంట చేసేటప్పుడు ఈ విషయాలు తప్పకుండా గుర్తుంచుకోవాలి. ఇత్తడిపాత్రల్లో నిమ్మకాయ, టమోటా వంటి సి విటమిన్ ఉండే ఆహారాలు ఎప్పుడూ వండకూడదు. వాటిని ఈ పాత్రలలో వండితే శరీరానికి హాని చేస్తుంది.

శరీరంలో ఐరన్ లోపిస్తే.. ఏం అవుతుందో తెలుసా?



అలసట


రక్తహీనతతో బాధపడేవారు బాగా విశ్రాంతి తీసుకున్నా తీవ్రమైన నీరసం వేధిస్తుంది. రూజువారి పనులకు కూడా అలసిపోతుంటారు. ఏ పనిచేయాలన్న ధ్యాస ఉండదు.

తలనొప్పి...

రక్తహీనత ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పితోపాటు మైకం కమ్మినట్లుగా అనిపిస్తుంది. ఐరన్ లోపంతో బాధపడే వారిలో హిమోగ్లోబిన్ లెవల్స్ తగ్గడం వల్ల పెదవులు, గోర్లు, చర్మం పాలిపోయినట్లు అనిపిస్తుంది.

మన శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుంది. దానిలో ఏ చిన్న సమస్య వచ్చినా పెను ప్రమాదంగా మారుతుంది. శరీరంలో తగినంత రక్తంలో లేకపోతే దాన్ని ఎనిమీయా అంటారు. శరీరంలో తగినంత ఐరన్ లేకపోవడం విటమిన్ లోపం వల్ల రక్తహీనత సమస్యకు దారి తీస్తుంది. అయితే, చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నా.. రక్తహీనత ఉన్నట్లు వారికి తెలియదు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరినప్పుడు మాత్రమే రక్త పరీక్ష చేస్తుంటారు. ఆ సమయంలో శరీరంలో రక్తం తక్కువగా ఉన్నట్లు గుర్తిస్తారు. అయితే ఇలా కాకుండా రక్తహీనత ఉన్నవారికి కొన్ని లక్షణాలు ఉంటాయి. వాటిని గుర్తించి సకాలంలో వైద్యం తీసుకోవాలి. ఎనిమీయా ఉన్నవారిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో వైద్యులు పేర్కొంటున్నారు. కాలేయం, కిడ్నీలు, గుండె వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువ రోజుల నుంచి మందులు వాడే వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇక క్యాన్సర్ చికిత్సలో భాగమైన కీమోథెరపీ చికిత్స్ తీసుకునేవారిలోనూ రక్తహీనత వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
సాధారణంగా ఏర్పడే ఎనిమీయా ఐరన్ లోపం వల్ల వస్తుంది. ఆహారం ద్వారా ఐరన్ లబించనట్లయితే లేదా శరీరంలో కణాలు ఆహారంలోని ఐరన్‌ను శోషించకపోవడం వల్ల ఈ రకం ఎనిమియా వస్తుంది.

దీపావళికి 'స్పిరిట్' ధమాకా



కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్'. గుల్షన్ కుమార్ సమర్పణలో టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. దీన్ని దీపావళి సందర్భంగా 2027 అక్టోబరు 29న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈమేరకు ఓ కొత్త పోస్టర్‌ని నెట్టింట పంచుకుంది. ప్రభాస్ అందులో స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ఆయన శక్తిమంతమైన పోలీసు పాత్రలో అలరించనున్నారు. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తుండగా.. రాజ్ తోట ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

'ధర్మన్'లో నయన్?

'చంద్రముఖి', 'దర్బార్' లాంటి చిత్రాల్లో కలిసి నటించి హిట్ జోడీ అనిపించుకున్నారు అగ్రహీరో రజనీకాంత్, కథానాయిక నయనతార. ఇప్పుడు వీరిద్దరూ మరోసారి తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ధర్మన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనువిందు చేయనున్నారట నయన్. ఆమె పాత్ర సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని సమాచారం. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్. మహేంద్రన్‌తో కలిసి దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో స్టైలిష్ డాక్టర్‌గా కనిపించనున్నారు రజనీ. ఇందులో సిమ్రాన్, రాశీఖన్నా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



తెరపై సంబరమే తరువాయి..



సంక్రాంతి బరిలో 'సంబరాల ఏటి గట్టు' చిత్రంతో సందడి చేయనున్నారు కథానాయకుడు సాయి దుర్గా తేజ్. రోహిత్ కేపీ దర్శకత్వం వహించిన ఈ సినిమాని కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. ధనంజయ, జగపతిబాబు, నరేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. 160రోజులకు పైగా చిత్రీకరణ చేసుకున్న ఈ సినిమా మొత్తం షూట్‌ని పూర్తి చేసుకున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియోను నెట్టింట పంచుకున్నారు. ఇదొక భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా సినిమా. సాయితేజ్ ఇందులో మునుపెన్నడూ చూడని రీతిలో రా రస్టిక్ లుక్‌లో ఓ యోధుడిలా కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది.



నాకు నేనే నిలబడాలని చేసిన చిత్రమిది

"ఈ భయం, స్ట్రెస్, యాంగ్జైటీ, డిప్రెషన్ తీసుకోవద్దు. ఇయ్యాలి.. ఇచ్చి పడేయ్యాలి" అంటున్నారు విష్వక్ సేన్. ఇప్పడాయన కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం '#కల్టీ'. సందీప్ కాకరాల నిర్మాత. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "వరుసగా మూడు ఫ్లాప్‌లు ఎదురైనప్పుడు కాస్త ఒత్తిడి, ఆందోళన చుట్టుముట్టాయి. నేనేమైనా తప్ప దారిలో వెళ్తున్నానా అనే సందేహం కలిగింది. అప్పుడే నా ఆయుధం నా చేతిలోనే ఉందని మా అన్న నాకు గుర్తు చేశారు. 'ఫలక్‌నుమా దాస్' సినిమా సమయంలో నా కోసం నేనెలాగైతే నిలబడ్డానో.. ఇప్పుడూ అలాగే నేనే నిలబడాలని గ్రహించి ఈ చిత్రాన్ని మొదలు పెట్టా. నిజానికి దీనికి తొలుత తాజుద్దీన్‌ని దర్శకుడిగా అనుకున్నాం. నా నట జీవితానికి ఆయనే గురువు. కానీ, వరుస పరాజయాల్లో ఉన్నప్పుడు నా చిత్ర బాధ్యతని నేనే తీసుకోవాలని దర్శకత్వ బాధ్యతని భుజాన వేసుకున్నా. ఈ విషయంలో తాజుద్దీన్‌కు క్షమాపణలు చెప్తున్నా. ఈ సినిమాతో దాదాపు 150మంది కొత్త నటీనటులు తెరకు పరిచయం కానున్నారు. వాళ్లు, నిర్మాతలు ఇచ్చిన సహకారంతోనే ఈ సినిమాని చేయగలిగా. సినిమా ప్రారంభమైన అయిదు నిమిషాల్లోనే ప్రేక్షకులు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అనిరుధ్ భాస్కర్, కార్తికేయ, ఇజి, తారక్, సందీప్ కాకర్ల తదితరులు పాల్గొన్నారు.



అందుకే నాయికా ప్రాధాన్య కథలో!

"సైయారా' తర్వాత రొమాంటిక్ చిత్రాలకు దూరంగా ఉండి.. సోలో సినిమా చేయాలనుకున్నాన"ని అంటున్నారు బాలీవుడ్ యువ కథానాయిక అనీత్ పడ్డా. చిత్రపరిశ్రమలోకి వచ్చిన తొలి అడుగులోనే మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ తార.. త్వరలో 'శక్తి శాలిని' అనే మహిళా ప్రాధాన్య చిత్రంతో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనీత్ మాట్లాడుతూ.. "హారర్ నేపథ్యంలో రూపొందుతున్న 'శక్తి శాలిని'లో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. 'సైయారా' తర్వాత నేను ఇలాంటి చిత్రంలోనే నటించాలని ఆశపడ్డా. అతీంద్రియ శక్తులతో రూపొందుతున్న ఈ చిత్రం నాలోని కొత్త కోణాన్ని తెరపై ఆవిష్కరించనుంది. నిజం చెప్పాలంటే నేను ఒక నాయికా ప్రాధాన్య కథలో నటించాలనుకున్నా. ఎందుకంటే ఇది నా సినిమా అని గర్వంగా చెప్పుకోగలిగే అవకాశం నాకు రావాలని కోరుకున్నా. కానీ రెండో సినిమాతోనే ఇలాంటి ఆఫర్ లభించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మొత్తం బాధ్యత నాపైనే ఉండటం కొంచెం భయంగా అనిపించినప్పటికీ.. చిత్ర ఫలితం ఏదైనా సరే... దానికి నేను బాధ్యత వహిస్తా" అని చెప్పుకొచ్చారు.



కొత్త కబురు వినిపిస్తారా!

కథానాయకుడు వరుణ్ తేజ్ ఇటీవలే 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకుల్ని పలకరించారు. ప్రస్తుతం తన కాలి గాయం నుంచి కోలుకుంటున్న ఆయన త్వరలోనే 'బరి' సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. అయితే ఈలోగానే ఇప్పుడీ విరామంలో కొన్ని కథలు విన్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఓ సినిమాకి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. దర్శకుడు అట్లీ శిష్యుడైన బాలాజీ దీనికి దర్శకత్వం వహించనున్నారని.. తమిళ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు ఈ ప్రాజెక్ట్‌ని నిర్మించే అవకాశముందని సమాచారం. అంతేకాదు మరోవైపు 'ఆయ్' ఫేమ్ అంజి కూడా వరుణ్‌కి ఓ స్క్రిప్ట్ వినిపించినట్లు ప్రచారం వినిపిస్తోంది. ప్రస్తుతం తన చేతిలో ఉన్న చిత్రాన్ని పూర్తి చేశాకే వరుణ్ ఈ రెండు ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించనున్నారు.

సూర్య 'సీన్' నుంచి రెండో పాట అప్డేట్..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'సీన్'. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ సూర్య కెరీర్‌లో 47వ సినిమాగా రాబోతుంది. 2D ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరం స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ సుశిన్ శ్యామ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ రిలీజ్ కాగా.. ఇందులో సూర్య డీఎస్పీ ప్రేమ్ రాజ్‌గా కనిపించిన తీరు ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నెలకొల్పింది. అలాగే ఫస్ట్ సింగిల్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'సీన్ నుండి రెండవ సింగిల్ 'Airplane' రేపు సాయంత్రం 6 గంటలకు విడుదలవుతోంది' అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చెయ్యగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నది.



This Newspaper is Published by Petta Venkata Suryanarayana from Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-ii, Gandhi Nagar, Medchal Malkajgiri,Telangana - 500037 on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises ,Plot No 98/Part 1, Co-operative Industrial Estate Phase-II, Gandhi Nagar, Medchal Malkajgiri, Telangana - 500037, e-mail: seshasai09@gmail.com, Phone: 9618880945